భూమిపుత్ర

మట్టి పరిమళాల అక్షర ఝరి

www.bhumiputradaily.com

తెలుగు దినపత్రిక

ANANTHAPURAMU | KURNOOL | YSR KADAPA | TIRUPATI |GUNTUR | KAKINADA |VISHAKAPATNAM | AMARAVATHI | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | WARANGAL|MAHABUBNAGAR |KHAMMAM

సంపుటి :07 | సంచిక:135 | ఆదివారం 31 ఆగస్ట్ 2025 | సంపాదకులు : సాకే సిరిప్రియ | పేజీలు :08 | ధర:02/-



ప్రధాని మోదీ చైనా పర్యటన..

భూమిపుత్ర,షాంఘై :

సహకార సంస్థ(ఎస్‌సీవో) శిఖరాగ్ర సదస్సుకు హాజరుకానున్న ప్రధాని మోదీ ఏడేళ్ల తర్వాత తొలిసారి చైనా పర్యటనకు వెళ్లారు. మోదీ రాకపై అక్కడి మీడియా, సోషల్ మీడియాలో ప్రత్యేక ఆసక్తి కనిపిస్తోంది అమెరికా సుంకాల ఒత్తిడికి వ్యతిరేకంగా మన ప్రధాని తీసుకున్న వైఖరిపై పలువురు హర్షం వ్యక్తంచేశారు.

ఆగస్టు 31, సెప్టెంబరు 1 తేదీల్లో తియాంజిన్ వేదికగా నిర్వహించనున్న ఎస్‌సీవో సదస్సు లో మోదీ పాల్గొననున్నారు. ఈ క్రమంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధినేత పుతిన్ సహా ఆయా దేశాధినేతలతో సమావేశం కానున్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వం తీసుకువచ్చేందుకు భారత్- చైనా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని మన ప్రధాని అంతకుముందు ఓ ఇంటర్వ్యూలో చెప్పిన విషయం తెలిసిందే.

కుప్పం చేరుకున్న కృష్ణమ్మ

కుప్పానికి రెండేళ్ల ముందే కృష్ణా పుష్కరాలు

కృష్ణమ్మను కుప్పానికి తెచ్చాను... మాట నిలబెట్టుకున్నాను

పోలవరం-బనకచర్లతో కరవు శాశ్వతంగా దూరం

8 సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన కుప్పం ప్రజల రుణం తీర్చుకుంటా ముఖ్యమంత్రి చంద్రబాబు

పరమసముద్రం చెరువు వద్ద కృష్ణమ్మకు సీఎం జలహారతి

2014-19 మధ్య కాలం నాటి అసెంబ్లీలో జరిగిన చర్చ వీడియోను సభలో ప్రదర్శించిన సీఎం చంద్రబాబు



02



ప్రజాస్వామ్యంలో హింస పనిచేయదు

జెండా కర్రే ఆయుధం- పవన్ కల్యాణ్

భూమిపుత్ర ,విశాఖపట్టణం:

ప్రజాస్వామ్యంలో హింస పనిచేయదని, జెండా కర్రే ఆయుధం, గుండెల నుంచి వచ్చే మాటే తూటా కావాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ జనసైనికులకు పిలుపునిచ్చారు. అలా చేస్తే కచ్చితంగా మార్పు వస్తుందని అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు కోసం దసరా తర్వాత త్రిశూల్ పేరుతో కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు పవన్ కల్యాణ్ ప్రకటించారు.

ఆంధ్రప్రదేశ్‌కు స్థిరత్వం కావాలని, కూటమి సర్కారు బలంగా ఉండాలని కోరుకుంటున్నానని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఏమైనా తప్పులు చేస్తే ప్రజలు, రాష్ట్రం నష్టపోతుందని హెచ్చరించారు. మళ్లీ అరాచక పాలన, చీకటి రోజులు వస్తాయని అన్నారు. జనసేన సిద్ధాంత ఆధారిత పార్టీ అని పవన్ కల్యాణ్ అన్నారు. అందరిలాగే తాను కూడా కష్టాల కొలిమి నుంచే వచ్చానని తెలిపారు.

విశాఖ వేదికగా విశాఖ మున్సిపల్ స్టేడియంలో 'సేనతో సేనాని' పేరుతో మూడు రోజులపాటు జరిగిన జనసేన పార్టీ విస్తృత స్థాయి సమావేశాలు ముగిశాయి. జనసేన పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. నాయకులనే వారు కింద నుంచే రావాలని సూచించారు. తాము ప్రజాక్షేమం కోరుకుంటున్నాయని, భయపడేది ఉండదు పోరాటాలే ఉంటాయని అన్నారు. పేరంటాలకు వెళ్లాలి, అదే సమయంలో పోరాటాలు చేయాలని మహిళ కార్యకర్తలకు సూచించారు. వేదికపైన ఉన్న నాయకులకు కార్యకర్తల విలువ తెలియాలనే తాను ఈ సమావేశం పెట్టానని పవన్ కల్యాణ్ తెలిపారు.

ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. పోరాటాల పురిటిగడ్డ తెలంగాణలో జనసేన పార్టీ ఆవిర్భవించిందని పవన్ కల్యాణ్? గుర్తు చేశారు. ఈ 11 ఏళ్ల ప్రయాణంలో ఏపీలో నిలదొక్కుకున్నామని, వందశాతం స్ట్రైక్‌రేట్‌తో దేశంలోనే చరిత్ర సృష్టించామని తెలిపారు. ఇంత మంది

02



సభలో అంతరాయాలతో ఎంపీలకే నష్టం

ప్రభుత్వానికి కాదు: రిజిజు

భూమిపుత్ర, న్యూఢిల్లీ :

పార్లమెంటులో తరచూ అంతరాయం కలిగించడం వల్ల సభ్యులకే నష్టం వాటిల్లుతుందని, ప్రభుత్వానికి కాదని పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు పేర్కొన్నారు. చర్చల్లో పాల్గొనాలని తమ నాయకులపై

02

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు జీవో

తెలంగాణ కేబినెట్ సంచలన నిర్ణయం

రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేయాలని తీర్మానం

సెప్టెంబర్‌లోగా స్థానిక ఎన్నికల నిర్వహణకు అంగీకారం

ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అజారుద్దీన్‌ల పేర్లు సిఫార్సు

భూమిపుత్ర, హైదరాబాద్ :



తెలంగాణ కేబినెట్ సంచలన నిర్ణయం తీసుకుంది. రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేయాలని నిర్ణయించింది. పంచాయతీ రాజ్ చట్టం2018 సవరణకు ఆమోదం తెలిపిన కేబినెట్.. రిజర్వేషన్ల పరిమితిపై గత ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్ స్థానంలో ఈ అసెంబ్లీలో ప్రత్యేక బిల్లు ప్రవేశ పెట్టాలని నిర్ణయించింది. అసెంబ్లీ తర్వాత ప్రత్యేక జీవో తెచ్చి కులగణన ఆధారంగా తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని చూస్తోంది. మొత్తానికి స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయనే దానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెర దించింది. తాజాగా స్థానిక సంస్థల

02

భాజపా అగ్రనేతల మద్దతు కోరతా

జస్టిస్ సుదర్శన్ రెడ్డి

భూమిపుత్ర, న్యూఢిల్లీ :



ఉప రాష్ట్రపతి ఎన్నికలో ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. వ్యక్తిగత సామర్థ్యాలను దృష్టిలో ఉంచుకొని, పార్టీ శ్రేణులతో సంబంధం లేకుండా తనకు మద్దతు ఇవ్వాలని రాజ్యసభ, లోక్‌సభ సభ్యులందర్ని కోరుతున్నట్లు చెప్పారు. ఒకవేళ తనను అనుమతిస్తే.. భాజపా అగ్రనేతల మద్దతు కోరేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు. బిహార్‌లో చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై ప్రశ్నలు లేవనెత్తిన ఆయన.. మెజార్టీ ఉన్నంత మాత్రాన ఇష్టం వచ్చినట్లు వ్యవహరించడానికి అధికారం కల్పించినట్లు కాదన్నారు.

"సమర్థత ఆధారంగా నా అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరుతూ రాజ్యసభ, లోక్‌సభ సభ్యులందరికీ లేఖలు రాశా. ఒకవేళ అనుమతిస్తే.. భాజపా అగ్రనేతలను కలిసి వారి మద్దతు కోరేందుకు సిద్ధంగా ఉన్నా" అని అన్నారు. రాంచీలో విలేకరులతో మాట్లాడిన ఆయన.. ఝూర?ండ్ సీఎం హేమంత్ సోరెన్‌ను కేంద్రం ఇబ్బందులకు గురిచేసిందని, ఆయన వ్యక్తిగత గౌరవాన్ని దెబ్బతీసిందని ఆరోపించారు. ఇదిలాఉంటే, సెప్టెంబర్ 9న జరగనున్న ఉపరాష్ట్ర ఎన్నికకు వేదిక సిద్ధమవుతోంది. ఎన్డీయే కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్, విపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డిల మధ్య పోటీ జరగనుంది. ఈ క్రమంలో ఇప్పటికే పలు రాష్ట్రాల్లో పర్యటిస్తున్న జస్టిస్ సుదర్శన్ రెడ్డి మద్దతు కూడగడుతున్నారు. ఉపరాష్ట్రపతిని ఎన్నుకునేది రాజకీయ పార్టీలు కాదని.. గౌరవ పార్లమెంటు సభ్యులతో కూడుకున్న ఎలక్టోరల్ కాలేజీ అని చెప్పారు. విచక్షణా శక్తిని వినియోగించి ఓటేయండని ప్రతి ఒక్క ఎంపీకీ లిఖిత అభ్యర్థన పంపుతున్నట్లు ఇటీవల చెప్పారు.



ఉగ్రవాదుల లాజిస్టిక్స్ నెట్‌వర్క్ బాగు ఖాన్ హతం!

భూమిపుత్ర , జమ్మూకశ్మీర్:

జమ్మూ కాశ్మీర్‌లోని గురేజ్ సెక్టార్‌లో భద్రతా దళాలు పెద్ద విజయాన్ని సాధించాయి. మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది బాగు ఖాన్ అలియాస్ సమందర్ చాచాను భద్రతా దళాలు ఎన్‌కౌంటర్‌లో హతమార్చాయి. పీఓకేలో నివసిస్తున్న బాగు ఖాన్‌ను ఉగ్రవాద ముఠాలు హ్యూమన్ జీపీఎస్ అని పిలిచేవారు. గత మూడు సంవత్సరాలలో, బాగు ఖాన్ గురెజ్ సెక్టార్‌లోని వివిధ ప్రాంతాల నుండి 100 కి పైగా చొరబాట్లకు పాల్పడ్డాడు.

ఈ ప్రాంతం రహస్య మార్గాల గురించి,

02

యూరియా కొరతపై బిఆర్ఎస్ ఆందోళన

కమిషనర్‌కు వినతి పత్రం సమర్పణ

సచివాలయం ముందు ఆకస్మిక ధర్నా

కెటిఆర్, హరీష్ తదితరులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

భూమిపుత్ర, హైదరాబాద్ :



రైతు సమస్యలు, పంట నష్టం, యూరియా కొరతపై వ్యవసాయ శాఖ కమిషనర్‌కు భారత రాష్ట్ర సమితి నేతలు వినతి పత్రం అందజేశారు. అనంతరం కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అన్నదాతల సమస్యలను పరిష్కరించాలని బైఠాయించారు. దీంతో కేటీఆర్, హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డితో పాటు పార్టీ ఎమ్మెల్సీలు, నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అంతకుముందు హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఏ రాష్ట్రంలోనూ యూరియా సమస్య లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం వల్లే.. తెలంగాణలో కొరత ఏర్పడిందని చెప్పారు. గత ప్రభుత్వంలో కరోనా సమయంలోనూ ఇబ్బంది లేకుండా పంపిణీ చేసినట్లు- వివరించారు. భాజపా, కాంగ్రెస్ ఒకరిపై ఒకరు నెపం వేసుకొని తప్పించు కుంటున్నారని దుయ్యబట్టారు. యూరియా పంపిణీ చేతకాకపోతే తప్పుకోవాలన్నారు. తాము రాజకీయాల కోసం రాలేదని.. రైతుల కోసం వచ్చినట్లు- పేర్కొన్నారు. యూరియా కోసం వెళ్తే రైతులపై దాడి చేస్తున్నారని నిరంజన్‌రెడ్డి విమర్శించారు. కొరత సమస్యపై ఒక్కరోజైనా సమీక్ష చేశారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్నదాతలకు కష్టాలు మొదలైన సంగతి తెలిసిందే. నాటి నుంచి నేటి వరకు రైతులకు అండగా నిలుస్తూ.. వారి పక్షాన బీఆర్ఎస్ నేతలు పోరాడుతూనే ఉన్నారు. గత కొద్ది రోజుల నుంచి యూరియా కొరతపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతుల కష్టాలపై బీఆర్ఎస్ నేతలు స్పందిస్తూనే ఉన్నారు. ఇవాళ కూడా వ్యవసాయ శాఖ కమిషనర్‌కు యూరియా కొరతను తక్షణమే తీర్చాలంటూ రైతుల తరపున బీఆర్ఎస్ నేతలు వినతిపత్రం సమర్పించామని అన్నారు.

ఆ తర్వాత ఎమ్మెల్యే హరీశ్‌రావు నేతృత్వంలో బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ సచివాలయాన్ని

02


ఆరుద్ర అత్యుత్తమ రచన సమగ్ర ఆంధ్ర సాహిత్యం



తెలుగు సాహిత్యంలో కవిగా, సినీగేయ రచయితగా, నవలా రచయితగా, పరిశోధకుడుగా, సాహిత్య విమర్శకుడుగా, నాటకకర్తగా ఆరుద్ర ఒక శాశ్వతమైన ముద్రను వేశారు. ఆరుద్ర పూర్తి పేరు భాగవతుల సదా శివశంకరశాస్త్రి. ఆయన కళాశాలలో చదువుకున్నది ఇంటర్మీడియట్ వరకు మాత్రమే. కానీ, ప్రత్యేక ఆసక్తితో తెలుగు, ఆంగ్ల సాహిత్యాన్ని ఔపోసనపట్టారు. జీవిక కోసం రకరకాల ఉద్యోగాలు చేసినా, మిలటరీలో కూడా పనిచేసి, చివరికి పాత్రికేయునిగా తన ప్రస్థానం కొనసాగి బహురూపాలుగా విస్తరించుకొంది. ఆయన 31 ఆగస్టు 1925 వ తేదీన జన్మించారు. త్వమేవాహమ్, సినీవాలి, కూనలమ్మపదాలు, ఇంటింటి పద్యాలు, గాయాలు–గేయాలు, పైలా పచ్చీసు మొదలైన కవిత సంపుటాలు ప్రచురించారు. ఆరుద్ర తన జీవిత సహచరి రామలక్ష్మితో కలిసి ఏటికేడాది అనే కవితాసంపుటి ప్రచురించారు. ఆ తర్వాత ఆయన వందలాది సినీగీతాలు రచించారు. వాటిని ఆరుద్ర రామలక్ష్మిగారు సంపాదకులుగా ఐదుసంపుటాలుగా వచ్చాయి. నేను చెప్పానుగా, ఆరుద్ర కథలు, డిటెక్టివ్ కథలు, రాశారు. వీటితో పాటు పలకల వెండిగ్లాసు, రెండు రెళ్ళు ఆరు, ఆనకట్టమీద ఆత్మహత్య, గ్రామాయణం వంటి నవలల్ని రచించారు. పన్నెండు దృశ్యనాటికలు, తొమ్మిది శ్రవ్యనాటికలు, రాదారి బంగళా వంటి ప్రసిద్ధ నాటకాల్ని రచించారు. శ్రీకృష్ణదేవరాయలు అనే రూపవాణి నాటకాన్ని కూడా రచించారు. ఆంగ్ల, తమిళ భాషల నుండి కొన్ని అనువాదాలు కూడా చేశారు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తెలుగు విశ్వవిద్యాలయం వారు గౌరవ డాక్టరేట్ ని ఇచ్చి ఆరుద్రను సత్కరించాయి. ఆంధ్ర విశ్వకళాపరిషత్ 'కళాప్రపూర్ణ'తో గౌరవించింది. తెలుగు విశ్వవిద్యాలయం వారు ఉత్తమ సాహిత్య విమర్శకుడుగా బహుమతినిచ్చి సత్కరించింది. వీటితో పాటు రాముడుకి సీత ఏమవుతుంది?, గుడిలో సెక్స్, గురజాడ గురుపీఠం, చదరంగం, దక్షిణవేదం, ప్రజాకళలూ– ప్రగతి వాదులూ, మహనీయులు, మనవేమన, వ్యాసపీఠం, సమగ్ర ఆంధ్ర సాహిత్యం వంటి అనేక పరిశోధన, సాహిత్య విమర్శ గ్రంథాలను రచించిన ఆరుద్ర 4 జూన్ 1998 న మరణించారు. ఆయన రచించిన సమగ్ర ఆంధ్ర సాహిత్యానికి గాను నాటి ఉభయ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆరుద్రగారి కుటుంబానికి పెద్దమొత్తంలో డబ్బు ఇచ్చి, వాటిని తెలుగు అకాడమీ ప్రచురించింది. ఉభయ రాష్ట్రాలలోను జూన్ నుండి ఆరుద్ర శతజయంతి (1925–2025) వేడుకలు ప్రారంభమవుతున్న సందర్భంగా ఆయనపై పరిశోధన చేసిన సెంట్రల్ యూనివర్సిటీ తెలుగుశాఖ పూర్వ శాఖాధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావుగారితో ముఖాముఖీ.

నమస్కారం సర్, మీరు ఆరుద్ర మీద పరిశోధన చేశారు కదా. ఆరుద్ర శతజయంతి సందర్భంగా మిమ్మల్ని ఇంటర్వ్యూ చేయాలని అనుకొంటున్నాను. ఆయన రచనలపైనే పరిశోధన చేయాలని మీరెందుకు అనుకున్నారు?

ఆచార్య దార్ల: నేను ఎం.ఫిల్., డా.యస్.టి. జ్ఞానానందకవి గారి ఆమ్రపాలి కావ్యంపై పూర్తి చేసి పిహెచ్డి కోసం సిద్ధమవుతున్నాను. మా సూపర్వైజర్ గారేమో ఎం.ఫిల్ చేసిన టాపిక్ నే పొడిగించి, అంటే డా.యస్.టి. జ్ఞానానందకవి గారి అన్ని రచనలపైనే పరిశోధన చేయమని అంటున్నారు. అప్పటికే ఆయనపై పరిశోధనలు జరుగుతున్నాయి. నా దృష్టిలో మరలా ఆయనపై డాక్టరేట్ చేసేటంతటి సాహిత్యం లేదనిపించింది. ఈ పరిస్థితుల్లో మాకు పాఠాలు చెప్పిన, నాకిష్టమైన గురువుల్లో ఒకరైన ఆచార్య కే.కే. రంగనాథచార్యులు గారి దగ్గరికి వెళ్ళి, నా భవిష్యత్తుకు సంబంధించి ఎలాంటి టాపిక్ తీసుకుంటే బాగుంటుందో చెప్పమని సలహా అడిగాను. నేను అకాడమిక్ రంగంలో స్థిరపడాలనే నా లక్ష్యాన్ని చెప్పడంతో ఆయన నన్ను ఆరుద్ర పై పరిశోధన చేస్తే బాగుంటుందని చెప్పారు. అప్పుడు కవుల చరిత్రలు, సాహిత్య చరిత్రలు అన్నీ చదివే అవకాశం ఉంటుందని, అది భవిష్యత్తులో విద్యాబోధనకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఆ విధంగా ఆరుద్ర రచనలపై, ప్రత్యేకించి సమగ్ర ఆంధ్ర సాహిత్యం, ఆయన పరిశోధనలపై ' పరిశోధకుడిగా ఆరుద్ర' అనే అంశంపై నా పరిశోధన దృష్టిని కేంద్రీకరించాను. ఆరుద్ర గారి 'గురజాడ గురుపీఠం' అనే గ్రంథానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు ఉత్తమ విమర్శకుడు పురస్కారాన్ని ఇచ్చారు. సమగ్ర ఆంధ్ర సాహిత్యంలో కూడా పరిశోధన, విమర్శ మిళితమై ఉన్నాయి.



ఆరుద్ర అనగానే సమగ్ర ఆంధ్ర సాహిత్యమే ప్రధానంగా చెప్పుకోవాలి. కానీ దానిపై పరిశోధన నాకు తెలిసినంతవరకు జరగలేదు. అందువల్ల దానిపై పరిశోధన చేయాలనుకున్నాను.

అంతకుముందు ఆరుద్ర పై ఎవరూ పరిశోధన చేయలేదా చెప్పండి?

నాకు తెలిసి కొన్ని పరిశోధనలు జరిగాయి. కె.చంద్రారెడ్డి గారు 'ఆరుద్ర కవితానుశీలన'(1979), కె. భీమేశ్వరరావుగారు 'ఆరుద్ర కవిత్వంలో అన్యదేశ్యాల పరిశీలన'(1983), వి. రామిరెడ్డిగారు 'ఆరుద్ర త్వమేవాహమ్ – పరిశీలన'(1987), ఎం. సుబ్బారావుగారు 'త్వమేవాహమ్ పరిశీలన' (1989), ఎల్. సంగయ్యగారు 'ఆరుద్ర జీవితం – రచనలు: సమగ్ర పరిశీలన' (1991), ఆర్. నరసింహారావుగారు 'అభ్యుదయ కవిత్వంలో ఆరుద్రత' (1992), కానీ, ఆరుద్ర సాహిత్య విమర్శ పరిశోధనలపై ప్రత్యేకమైన పరిశోధన జరగలేదు. ఆచార్య మేడిపల్లి రవికుమార్ గారు సాహిత్య అకాడమీ వారి భారతీయ సాహిత్య నిర్మాతలు సిరీస్ లో భాగంగా ఆరుద్రపై ఒక మంచి పుస్తకం రాశారు.

మీరు ఆరుద్ర పై ఏ సంవత్సరంలో పరిశోధన మొదలుపెట్టి, ఎప్పటికి పూర్తి చేశారు? మీరు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా ఎప్పుడు చేరారు?

నా ఎం.ఫిల్ 1997లో పూర్తి చేశాను. 1998లో పిహెచ్.డి.లో చేరాను. ఆరుద్ర గారు కూడా 4 జూన్ 1998లో మరణించారు. ఆ సందర్భంగానే చాలా మంది సమగ్ర ఆంధ్ర సాహిత్యంపై ఆరుద్ర పరిశోధన చేశారని ప్రస్తావించడమే తప్ప, ఎలాంటి పరిశోధన చేశారనేది చెప్పేవారు కాదు. ఆ విషయాలు కూడా ఆచార్య కే.కే. రంగనాథచార్యులు గారితో చర్చించినప్పుడు ఒక నవ్వు నవ్వి అందుకే 'నువ్వు పరిశోధన చేసి చెప్పు' అన్నారు. అలా నా పరిశోధనను ప్రారంభించి జూలై, 2003 నాటికి పూర్తి చేశాను. నా పిహెచ్.డి. పూర్తి కాకముందే అంటే 2001లో డిగ్రీ కళాశాలలో తెలుగు ఉపన్యాసకుడుగా ఉద్యోగం వచ్చింది. రెండేళ్లపాటు రెగ్యులర్ గా రీసెర్చ్ మెథడాలజీతో పార్ట్ -1 పూర్తి చేస్తే, ఆ లోగా పర్మినెంట్ ప్రాతిపదికన ఉద్యోగం వస్తే, పిహెచ్.డి ని పార్ట్ టైమ్ గా మార్చుకొనే సౌలభ్యం ఉంది. దాని వల్ల ఆ ఉద్యోగంలో చేరి, ఆ బోధనానుభవం, అధ్యయన అనుభవాలతో 2003లో నా సిద్ధాంత గ్రంథాన్ని పూర్తి చేశాను. అది అయిన వెంటనే సెంట్రల్ యూనివర్సిటీ లో నోటిఫికేషన్ రావడం, అసిస్టెంట్ ప్రొఫెసర్ గా సెలెక్ట్ కావడంతో 2004 లో యూనివర్సిటీ లో చేరాను.

కవిత్వం, సినిమా పాటలు, నాటకాలు ఎన్నింటిలోనో బిజీ బిజీగా ఉండే ఆరుద్ర పరిశోధనలోకి ఎలా వచ్చారు?

నిజానికి ఆరుద్ర గారు ఒక సినిమా కథ డిస్కషన్ లో భాగంగా పరిశోధనలోకి దిగారు. ఆయనకు కవి తిక్కన, ఖడ్గ తిక్కన ఒక్కడా? వేర్వేరా? అనే సందేహం వచ్చింది. దాన్ని ఆ సందేహాన్ని తీర్చుకోవడం కోసం అన్వేషణ మొదలైంది. ఆ విషయాన్ని ఆయన తన వ్యాసపీఠం అనే గ్రంథంలో స్పష్టంగా చెప్పుకున్నారు. అప్పటికి (1948) ఆరుద్ర కు తెలుగు సాహిత్య చరిత్రతోనే పరిచయం లేదట. దీన్ని అన్వేషించడం కోసం కొన్ని గ్రంథాలను అధ్యయనం చేశాడు. తిక్కన అనే పేరుతో సంబంధం ఉన్న కొన్ని పుస్తకాలను ఆరుద్ర చదివాడు. కేతన తన దశకుమార చరిత్రను తిక్కనకు అంకితం ఇచ్చాడు. కాకతీయ రాజుల చరిత్రను ముఖ్యంగా ప్రతాప రుద్రుని చరిత్రను తెలియజేసే కాసె సర్వప్ప రచించిన శ్రీ సిద్దేశ్వర చరిత్ర అనే ద్విపద కావ్యం, తిక్కన రచించిన నిర్వచనం రామాయణం వంటి రచనలను పరిశీలించాడు. వీటితోపాటు కాటమరాజు కథలో తిక్కన ప్రస్తావన ఒకటి వస్తుంది. కనుక వాటిని కూడా అధ్యయనం చేశాడు. కాటమరాజు తో జరిగిన యుద్ధంలో తిక్కన మరణిస్తాడు అతన్నే ఖడ్గ తిక్కన, రణతిక్కన అని పిలుస్తారు. వీరిద్దరూ ఒక్కరా, వేర్వేరా అనేది తెలుసుకోవడం కోసం మల్లంపల్లి సోమశేఖర శర్మ, వేటూరి ప్రభాకర శాస్త్రి తదితరుల పరిశోధనా అంశాలను కూడా అధ్యయనం చేశారు. మొత్తం మీద ఇద్దరు వేర్వేరని అయితే ఇద్దరికీ బంధుత్వం ఉందని తేల్చాడు ఆరుద్ర. వీటన్నింటినీ పరిశీలించిన తర్వాత ఆరుద్ర ఒక వంశ వృక్షాన్ని కూడా తయారు చేశాడు. కాటమరామరాజు కథ అనే పేరుతో ఒక స్టేజి నాటకాన్ని కూడా రచించారు.

సారకవితాభిరాముడు, గుంటూరు విభుడు అయిన కొట్టరపు భాస్కరమంత్రికి నలుగురు కొడుకులు. మూడవ కుమారుడైన సిద్ధనమంత్రికి ఏడుగురు కొడుకులు. వీళ్ళలో పెద్దవాడు ఖడ్గతిక్కన. భాస్కరమంత్రి నాలుగో కుమారుడైన కొమ్మన దండ నాథునికి ఒక్కడే కొడుకు. అతడే కవితిక్కన అని ఆరుద్ర నిరూపించి, సాహిత్య పరిశోధన వడ్డించిన విస్తరి కాదన్నారు. ఆరుద్ర అలా పరిశోధనలోకి పరిశోధించారు.

గురజాడ గురుపీఠం గ్రంథాన్ని ఆధారం చేసుకుని ఆరుద్రకు ఉత్తమ విమర్శకుడు పురస్కారం ఇచ్చారు కదా. ఆ గ్రంథం ప్రత్యేకత ఏమిటి?

ఔను. ప్రధానంగా ఈ గ్రంథాన్ని ఆధారంగా చేసుకునే ఆరుద్ర పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు ఉత్తమ విమర్శకులు పురస్కారాన్ని ఇచ్చి గౌరవించారు. గురజాడ చేసిన భాషా సాహిత్యాల కృషిని, అభ్యుదయ దృక్పథాన్ని ఆ గ్రంథంలో ఆరుద్ర ఎంతో శాస్త్రీయంగా విశ్లేషించారు. గురజాడ తన కవిత్వంలో చేసిన ప్రయోగాలు, ఆ ప్రయోగాల్లోని సామాజిక అభ్యుదయ ఆకాంక్ష, ఆయన ప్రదర్శించిన వ్యావహారిక భాషా దృక్పథం, కన్యాశుల్కంలోని పాత్రల విశిష్టత వంటివన్నీ అనేక మంది సాహితీవేత్తలతో, అనేక గ్రంథాలతో పోల్చి చెప్పడం ఆ గ్రంథంలో కనిపించే ఒక విశిష్టత.

గురజాడ జీవిత దృక్పథం, రచనల పరిణామం ఆరుద్ర 'గురజాడ గురుపీఠం' లోనూ, 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం' (11వ సంపుటి) లోనూ, ప్రత్యేక సంచికల్లో, పత్రికల్లో, వివిధ పుస్తకాలకు రాసిన 'ముందుమాట' ల్లోనూ ప్రకటించారు. అయితే, వీటన్నింటిలో కంటే, 'గురజాడ గురుపీఠం' గ్రంథంలో గల వ్యాసాల్లోనే ఆరుద్ర విమర్శనా దృక్పథం బాగా వ్యక్తమవుతుంది. గురజాడ కన్యాశుల్కం రచన చేయడంలో గానీ పూర్ణమ్మలో బాల్యవివాహాల సమస్యల్ని కరుణ రస ప్రధానం చేయడంలో గానీ, సోషల్ రిఫార్మ్, స్పోకెన్ తెలుగు అనే వాటినే మనసులో పెట్టుకున్నారని ఆరుద్ర చెప్పారు.

ఆయన అన్ని పుస్తకాల కంటే ఆ పుస్తకంలో ఉత్తమ విమర్శకుడికి ఉండవలసిన లక్షణాలన్నీ ఆరుద్రలో చూడాలంటే ఆ పుస్తకం చూడాలి. మిగతా అన్ని రచనల్లోనూ విషయాన్ని సాగదీసి చెప్తారు. కానీ, ఈ గ్రంథంలో తాను చెప్పవలసిన అంశాలన్నీ సూటిగా చెప్పారు. 'వేమన్న వేదం' లో ఆరుద్ర వ్యాఖ్యానం మార్క్సిస్టు విమర్శనా దృక్పథాన్ని కలిగి ఉందనే కంటే, ఆ దృక్పథానికి వీలయ్యే పద్యాలకే వ్యాఖ్యానాన్ని కొనసాగించారనడం సమంజసం. వేలకొలదీ ఉన్న వేమన పద్యాలన్నింటినీ వ్యాఖ్యానిస్తే, భిన్నదృక్పథాలు వెలువడవచ్చు. ఈ విషయంలో పరిశోధకులు వేమన పద్యాల గురించి


ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

ఎన్నో చర్చోపచర్చలు జరుపుతూనే ఉన్నారు. ఆరుద్ర తనది అభ్యుదయ దృక్పథమని చెప్పుకోవడమే కాకుండా, ఈ గ్రంథానికి "ఆముఖం" రాస్తూ ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు "వేమన కవిత అభ్యుదయ భావ ప్రచారానికి అభినవ సాధనంగా సమాదరింప బడుతున్నది. సామాజిక వ్యవస్థను సామ్యవాద దృక్పథంతో సమక్షించి సౌమ్యశీలంతో సత్యాన్ని విశ్వజనీనంగా ప్రతిపాదించగలిగిన ప్రతిభావంతులు" గా ఆరుద్రను ప్రశంసించారు.

గురజాడను కొంత మంది మార్క్సిస్టు అనీ, హేతువాది అనీ, నాస్తికుడు అనీ రకరకాలుగా వ్యాఖ్యానించారు. ఇలాంటి అభిప్రాయాల నేపథ్యంలో గురజాడను ఆరుద్ర ఎలా నిరూపించారు?

గురజాడను కొన్ని సందర్భాలలో అభ్యుదయ ఆకాంక్ష సామాజిక స్పృహ ఉన్న సంస్కరణ వాదిగా, మానవతావాదిగా ఆరుద్ర వ్యాఖ్యానించారు. కన్యాశుల్కం నాటకంలో ఆయన భాషా దృక్పథం ప్రజా దృక్పథమన్నారు. ఆ నాటకంలో సౌజన్యరావు పంతులు మధురవాణికి భగవద్గీత ఇవ్వడాన్ని ఆధారంగా చేసుకుని గురజాడను పూర్తిగా మార్క్సిస్టు భావజాలం ఉన్న వ్యక్తిగా చెప్పలేమని అన్నారు. ఈ ఆధారంతోపాటు పూర్ణమ్మ, కన్యక వంటి కావ్యాలను, గురజాడ లేఖలను కూడా పరిగణనలోకి తీసుకున్నారు. గురజాడ మొత్తం సాహిత్యాన్ని మూల్యాంకన చేస్తూ అక్కడక్కడా కొన్ని మార్క్సిస్టు ధోరణులు కనిపిస్తున్నా, అప్పారావుగారు హేతువాదే గాని, నాస్తికులు కాదని కూడా ఆరుద్ర తన నిర్ణయాన్ని ప్రకటించారు.

కవిగా, సినీరచయితగా ఎంతో పేరు ప్రఖ్యాతులు ఉన్న సమయంలో ఆరుద్ర సమగ్ర ఆంధ్ర సాహిత్యం రాయాలనుకోవడానికి వెనుక గల కారణాలు ఏమిటి?

ఆరుద్ర మొదట పాత్రికేయుడు. తర్వాతే ఆయన కవి, రచయిత, పరిశోధకుడు. కొంతమంది పాత్రికేయులకు సమాజంలో ఏం జరుగుతుందనే విషయాన్ని చెప్పడం మాత్రమే కాకుండా, తమ చరిత్రను, సంస్కృతిని, సాహిత్య స్థితిగతులను అందించాలనే తపన కూడా ఉంటుంది. తద్వారా సామాజిక మార్పుకి చాలామంది పాత్రికేయులు శక్తివంచన లేకుండా కృషి చేస్తారు. వార్తలకు మాత్రమే పరిమితం కాకుండా జీవవంతమైన సామాజిక నిర్మాణంలో భాగస్వాములు అవుతుంటారు. అదే ఆరుద్రను అనేక పత్రికల్లో రకరకాల శీర్షికలు నిర్వహించేలా చేసింది. అలా ఆయన సినిమాలకే అంకితం కావచ్చు. కానీ, ఆయన ఆత్మ అంతా సాహిత్యంతోనే ముడిపడి ఉంది. ఆ సమయంలో అంటే 1965 ఏప్రిల్ లో మొదటి సంపుటి వెలువరించేటప్పుడు తమ లక్ష్యాలను స్పష్టంగా ప్రకటించారు. నెల నెలా సమగ్ర ఆంధ్ర సాహిత్యం 12 పుస్తకాలుగా విడుదల చేయాలని భావించారు.

ఆరుద్ర సమగ్ర ఆంధ్ర సాహిత్యంలో రాజులు పోషకుల ఆధారంగా యుగ విభజన చేయడానికి గల కారణాలు ఏమిటి?

సమగ్ర ఆంధ్ర సాహిత్యంలో రాజుల, పోషకులను ఆధారంగా యుగ విభజన చేసినా, చరిత్ర, కాలనిర్ణయాలను స్పష్టంగా విశదీకరించే ఆలోచన ఆరుద్ర సత్యాన్వేషణను ప్రతిబింబిస్తుంది. వివిధ కాలాల్లో రాజులు, పోషకులు కవుల్ని పోషించారనీ, కవులు, రాజుల పోషణకు అర్రులు చాచారనీ, ఆ కార్యకారణ సంబంధాల్లో ఉన్న రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితుల్ని గతి తార్కిక 'చారిత్రక' భౌతిక విశ్లేషణలతో సత్యాన్వేషణతోనే ఆరుద్ర ఆ యుగవిభజనను ఎంపికచేసుకున్నారు. కేవలం పోషకుల ఆధారంగానే యుగవిభజన చేయలేదు. ప్రక్రియల వారీగా కూడా విభజన చేశారు. ఆధునిక సాహిత్యాన్ని అంతా అలాగే విభజించారు. 'కవిత్వవేది' కల్లూరి వేంకట నారాయణరావు గారి 'ఆంధ్రవాఙ్మయ చరిత్ర సంగ్రహం'లోని యుగవిభజనకు సురవరం ప్రతాపరెడ్డిగారి 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' ప్రభావంతోను ఆరుద్ర చేసిన యుగవిభజన ఉంటుంది. చారిత్రక పరిస్థితుల్ని ఆధారంగా చేసుకొని ఒక క్రమపద్ధతిలో అధ్యయనం చేయడానికి బాగుంటుందని ఆరుద్రదీన్ని ఎన్నుకొని ఉంటారు.

సమగ్ర ఆంధ్ర సాహిత్యంలో ఎంతమంది కవుల్ని, వారి రచనల్ని ఆధారంగా చేసుకుని సమగ్ర ఆంధ్ర సాహిత్యాన్ని రచించారో ఒక అంచనాగా చెప్తారా?

ఆరుద్ర తన సమగ్ర ఆంధ్ర సాహిత్యంలో దాదాపు వెయ్యి మందికి పైగానే తెలుగు కవుల్ని వారి రచనల్ని విశ్లేషణ చేస్తూ తనదైన శైలిలో విమర్శనాత్మక, పరిశోధనాత్మక దృక్పథాల్ని తెలియజేశారు. ఆ కవులను మాత్రమే కాకుండా గ్రంథాలను వివరించేటప్పుడు మరి కొంతమంది రచనలు కూడా పేర్కొన్నారు. వాటిని తొలి, మలి ముద్రణలలో చేసిన మార్పులు చేర్పులను, ఆ కవుల వివరాలను ఒక పట్టికగా నా డాక్టరేట్ సిద్ధాంత గ్రంథం అనుబంధంలో వేశాను. అయితే, ఇంచుమించు అదే పద్ధతిలో తెలుగు అకాడమీ వారు కూడా ఇటీవల ఆరుద్ర పేర్కొన్న కవులు కాలాలను తెలుపుతూ ఒక పుస్తకంగా ప్రచురించారు.

తనకు బంధుత్వం ఉన్నప్పటికీ శ్రీశ్రీ పై ఆరుద్ర వైయక్తికమైన విమర్శ చేశాడని అంటారు. ఆ విషయాలేమైన సమగ్ర ఆంధ్ర సాహిత్యంలో గమనించారా ?

తన సాహిత్య అభిలాషకు కారణంగా చెప్పిన అనేకమంది సాహితీవేత్తలలో శ్రీశ్రీ కూడా ఒకరు. స్వయంగా ఆయనకు బంధువు అవుతాడు కూడా. అబ్బూరి రామకృష్ణారావు, పింగళి లక్ష్మీకాంతం, నారాయణ బాబు, రావిశాస్త్రి, చాసో, రోణంకి అప్పలస్వామి మొదలైన వారితో ఆరుద్ర నిరంతరం కలుస్తుండేవాడు. శ్రీశ్రీ, పఠాభి, కొడవటిగంటి కుటుంబరావు, సెట్టి ఈశ్వరరావు, కోగంటి గోపాలకృష్ణయ్య మొదలైన వారి వల్ల ఆయనకు అభ్యుదయ భావజాలం అలవడింది. ఆరుద్ర నిరుద్యోగిగా ఉన్నప్పుడు శ్రీశ్రీ దగ్గరకు చేరుకొని ఉద్యోగ ప్రయత్నాలు కూడా చేశాడు.

ఆరుద్ర అత్యుత్తమ రచన సమగ్ర ఆంధ్ర సాహిత్యం

క్రమేపీ శ్రీశ్రీకి ఆరుద్రకు ఏవో వ్యక్తిగతమైన వివాదాలు వచ్చాయి. వాటికి నా సిద్ధాంత గ్రంథంలో ఎక్కువ ప్రాధాన్యాన్ని ఇవ్వలేదు. సమగ్ర సాహిత్యంలో ఆయన రాసిన అంశాలకు మాత్రం పరిమితం అయ్యాను. 'రెండు శ్రీలు ధరించి/ రెండు పెగ్స్ బిగించి / వెలుగు శబ్ద విరించి / ఓకూనలమ్మ" అని తన కూనలమ్మ పదాల్లో శ్రీశ్రీని అభివర్ణించారు ఆరుద్ర.

తనతో సంబంధ బాంధవ్యాలు సక్రమంగా కొనసాగినంత కాలమూ ఒక పద్ధతిలోనూ, తర్వాత మరొక రకంగానూ విమర్శను కొనసాగించడం ఒక విమర్శకుని దృక్పథాన్ని పట్టి చూసినప్పుడు సద్విమర్శను కొనసాగించలేదని నిరూపితం కావడం తప్పదు. ఆరుద్రలో శ్రీశ్రీ పట్ల ఇలాంటి విమర్శనా దృక్పథం కనిపిస్తుంది. సమగ్రాంధ్ర సాహిత్యంలో కొన్ని విషయాల్లో ఆరుద్ర వ్యాఖ్యానాలు ఈ విషయాన్ని నిరూపిస్తున్నాయి. వాటిని కింది విధంగా పరిశీలించవచ్చు. ఆరుద్ర, శ్రీశ్రీపై వ్యక్తీకరించిన కొన్ని అభిప్రాయాల్ని యధాతథంగా కింద పేర్కొనడం ద్వారా ఆరుద్ర దక్పథం స్పష్టమవుతుంది. "శ్రీశ్రీ అరవింద ఘోష్ను ఎప్పుడూ అరవింద ఘూస్టు అని పేర్కొనేవాడు" (స. ఆ. సా. 13 సం. పు. 96). "మహాప్రస్థానం గీతానికి నజ్రల్ ఇస్లామ్ కవితా, హరీన్ రాసిన 'షురూ హువా హై జంగ్' అనే పాటా, శిష్టా రచించిన 'మారో – మారో – మారో' అనే పాటా ప్రోద్బలాలని, అయినీత తన గీతరచనకు ఉత్తేజితమచ్చినవేవో 'చిరకాలం' దాకా శ్రీశ్రీ చెప్పలేదు" (స. ఆం. సా., 13 సం. పు. 146). దీన్ని ఇటీవల పునర్ముద్రణ చేసిన తెలుగు అకాడమీ (నాల్గవ సంపుటి పు. 764) కూడా మార్చకుండానే ప్రచురించింది."శ్రీశ్రీ సాహిత్య జీవితంలో పరిస్థితులకు వ్యక్తిగత జీవితంలో పరిస్థితులకు సమన్వయం సైకాలజిస్టులే చేయగల ప్రయత్నం" (స. ఆం. సా. 13వ సం. పు. 264).

ఇవన్నీ సమగ్ర ఆంధ్ర సాహిత్య 13వ సంపుటిలో శ్రీశ్రీ పట్ల ఆరుద్ర చేసిన వ్యాఖ్యలు. ఆరుద్ర తన 'గురజాడ గురుపీఠం'లో 'సంకల్పం' శీర్షికతో ముందు మాట రాసుకొంటూ... "జాఢ్యం ముదిరినవాడు తానే ఆద్యుడనుకొంటాడు. 1972లో నేనూ ఈ పాతికేళ్ల సాహిత్యం అనే వ్యాసంలో ఇతగాడు 1939 దాకా తెలుగు సాహిత్యం నన్ను నడపించింది. ఆ తర్వాత నుంచీ దాన్ని నేను నడిపిస్తున్నానని నిస్సార స్వోత్కర్ష చేసుకున్నాడు. బండిచక్రం మీదనున్న ఈగ ఆ బండిని తానే కదిలిస్తాననుకొంటుంది. చారిత్రక, భౌతికవాది ఎవరూ యిలా అనుకోరు. 1930 నుంచీ తెలుగు సాహిత్య చరిత్ర శ్రీశ్రీ స్వీయ చరిత్ర అని కూడా ఆ ప్రబుద్ధుడు నొక్కి వక్కాణించాడు" అని అన్నారు.

అభ్యుదయవాదిగా భావించే ఆరుద్ర సమగ్ర ఆంధ్ర సాహిత్యంలో గానీ, విడిగా గానీ స్త్రీవాద, దళిత, ప్రాంతీయ అస్తిత్వవాద ఉద్యమాల గురించి ఏమైనా రాశారా?

ఆరుద్ర తన సమగ్ర ఆంధ్ర సాహిత్యం 13వ సంపుటి పూర్తి చేసే నాటికి తెలుగు సాహిత్యం లో స్త్రీవాద, దళిత ఉద్యమాలు ఇంచుమించు ప్రాచుర్యంలోకి వచ్చేశాయనే చెప్పాలి. ఆ ప్రభావం వల్లనే ఇండియా టుడే వార్షిక సాహిత్య సంచిక(1995)లో 'మనిషి–ఆడమనిషి' (ఆధునిక మహాకావ్యం) అనే పేరుతో కొన్ని భాగాల్ని 'స్త్రీ పురాణం' పేర్కొన్నారు. అయినా గాని దీన్ని ఒక స్త్రీవాద కావ్యంగా పూర్తి చేయలేదు. ఇది అసంపూర్ణంగానే మిగిలిపోయింది. గుర్రం జాషువాని కూడా ఒక కవికోకిలగా చూశారే తప్ప దళితుల ఆర్తిని శక్తివంతంగా వ్యక్తీకరించిన దళిత ప్రాతినిధ్య కవిగా చూడలేదు. అనేక మంచి దళిత కవులను ప్రస్తావించలేదు. తెలంగాణ ప్రాంతానికి చెందిన కవులను ఇతర సాహిత్య చరిత్రలతో పోలిస్తే అనేకమందిని ఆరుద్ర తన గ్రంథంలో పేర్కొన్నారు.

కవుల చరిత్ర, సాహిత్య చరిత్రలను ఎవరు రాసినప్పటికీ అందరినీ లేదా అన్ని ఉద్యమాలను రాయలేకపోవచ్చు. అందుకనే ముందుగా ఆ జిల్లాకు చెందిన కవుల, సాహిత్య చరిత్రలు వెలువడాలి. అటువంటి పరిశోధనలు ఈ మధ్యకాలంలో మొదలయ్యాయి. కవుల చరిత్ర, సాహిత్య చరిత్ర రచన అనేది నిరంతరం కొనసాగే ఒక ప్రక్రియ. ఆచార్య ఎస్వీ రామారావు, డాక్టర్ ద్వా.నా.శాస్త్రి, ఆచార్య వెలమల సిమ్మన్నగార్ల రచించిన సాహిత్య చరిత్రలు అనేకమంది కవులను, ఉద్యమాలను ప్రస్తావించాయి.

మన తెలుగులో కవుల చరిత్రలు, సాహిత్య చరిత్రలు, వికాస చరిత్రలు అనే సంప్రదాయం ఉంది కదా! ఆరుద్ర సమగ్ర ఆంధ్ర సాహిత్యం వీటిలో దేనికి చెందుతుంది?

మూడింటికీ చెందుతుంది. కానీ, ఎక్కువగా సాహిత్య చరిత్ర, వికాస చరిత్రల స్వభావాన్ని కలిగి ఉంటుంది. కవుల పుట్టుపూర్వోత్తరాలు, రచనల వివరాలు, కర్తృత్వ వివాదాలు చర్చించేటప్పుడు కవుల చరిత్రలు చదువుతున్నట్లు అనిపిస్తుంది. కానీ రచనలను వివరించేటప్పుడు ఆశ్వాసాంత కథలను, వస్తు వైవిధ్యాన్ని ఇతర కావ్యాలతో తులనాత్మకంగా పరిశీలించడం కావ్య లేదా రచనల మూలాల్ని వివరించడం, కవి లేదా రచయిత దృక్పథాల్ని అంచనా వేయడం వంటివాటిని వివరించేటప్పుడు సాహిత్య చరిత్రలా అనిపిస్తుంది. కవి ప్రభావాలను, యుగ విభజనలను పక్రియా పరిణామ స్థితి గతులను వివరించేటప్పుడు వికాస చరిత్రలా స్ఫురిస్తుంది. కానీ, మూడింటిలో దేనిగా నిర్ణయించాలో చెప్పమంటే మాత్రం సాహిత్య చరిత్ర వికాసచరిత్రల సమ్మిళిత రూపంగా ఆరుద్ర గారి సమగ్ర ఆంధ్ర సాహిత్యాన్ని వ్యాఖ్యానించవచ్చు.

ఆరుద్ర సమగ్ర ఆంధ్ర సాహిత్యంలోను, ఇతర రచనల్లోను, భాషా శైలిలో కనిపించే ప్రత్యేకతల్ని తెలపండి?

ఏ విషయాన్నైనా సృజనాత్మకంగా చెప్పడం ఆయన శైలిలో కనిపించే ప్రత్యేకతే! నిజానికి సృజనాత్మక సాహిత్యం – కవిత, కథ, నవల, నాటకం వంటి వాటిలో సృజనాత్మక ఉండాలి. దానితో పాటు భావుకత, అభివ్యక్తి వైవిధ్యం రచనను ఆసక్తిగా చదివించేలా చేస్తాయి. జ్ఞానమే ప్రధానమైన విమర్శ, పరిశోధన వ్యాసాలలో సృజనాత్మక శైలి కంటే విషయాన్ని సూటిగా, స్పష్టంగా అర్థమయ్యేలా చెప్పాలి. కానీ, ఆరుద్ర విమర్శ, పరిశోధనల్లో కూడా సృజనాత్మకతను ప్రదర్శించేవారు. దానివల్ల రెండు మూడు సార్లు చదివితే తప్ప ఆయన చెప్పే విషయం స్పష్టంగా బోధపడటం సాధ్యం కాదు.

తెలుగులో వచ్చిన సాహిత్య చరిత్రల్లో మీకు నచ్చిన రచన ఏది?

తొలితరంలో పింగళి లక్ష్మీకాంతంగారి 'తెలుగు సాహిత్య చరిత్ర', 'కవిత్వవేది' కె.వి. నారాయణరావు 'ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సంగ్రహము' చాలా బాగుంటాయి. ఆ తర్వాత ఆధునిక కాలంలో సుంకిరెడ్డి నారాయణరెడ్డిగారి 'ముంగిలి' (తెలంగాణ ప్రాచీన సాహిత్య చరిత్ర) ఆ స్వరూప స్వభావాలను విస్మరించకుండా, విషయాన్ని సూటిగా, స్పష్టంగా చెప్పిన రచనలు. వాటితో పాటు కె.కె. రంగనాథాచార్యులు గారి 'తెలుగు సాహిత్యం – చారిత్రక భూమిక', 'తెలుగు సాహిత్యంలో మరో చూపు', జి.వి. సుబ్రహ్మణ్యంగారి 'సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు', పిల్లి జాన్సన్ గారి 'దళిత సాహిత్య చరిత్ర' సంగిశెట్టి శ్రీనివాస్ 'తెలంగాణ దళితోద్యమ చరిత్ర' మొదలైనవి కూడా మౌలిక రచనలే.

పాత్రికేయునిగా, కవిగా, సినీగేయ రచయితగా, కథకుడిగా, నవలా రచయితగా, విమర్శకుడిగా, పరిశోధకుడిగా, చరిత్రకారుడిగా ఆరుద్ర దేనిలో సక్సెస్ అయ్యారని భావిస్తారు?

వీటిలో ఆయన కొన్ని జీవిక కోసం చేసినవి. మరికొన్ని తన భావోద్వేగాల్ని సామాజిక స్పృహను వ్యక్తీకరించేవి. ఇంకొన్ని తనకు వచ్చిన అవకాశాల్ని వినియోగించుకోవడానికి విమర్శ, పరిశోధన సాహిత్యచరిత్ర పరిశోధన తన జ్ఞానాన్వేషణతో జ్ఞానతృష్ణను తీర్చుకోవడంలో భాగంగా చూడాలి. ఇవన్నీ ఆ కాలం, ఆ వయస్సు దృష్టితో చూసినప్పుడు అన్నింటిలోను ఆయన సక్సెస్ అయ్యినట్లే. అయినప్పటికీ సినీవాలి, త్వమేవాహం, ఇంటింటి పద్యాలు, ఆయన్ని కవిగా గుర్తించేలా చేశాయి. కొన్ని సినీగీతాలు ఆయణ్ణి చలనచిత్ర రంగంతో విడదీయరాని బంధాన్ని కలిగించాయి. వీటన్నింటినీ కంటే గురజాడ గురుపీఠం ఆయణ్ణి విమర్శకుడిగా రాముడికి సీత ఏమవుతుంది, సమగ్ర ఆంధ్ర సాహిత్యం వంటి గ్రంథాలు ఆయణ్ణి పరిశోధకులు చిత్రకారుడిగా ఒక విశిష్ట స్థానంలో నిలబెట్టాయి.

ఆరుద్ర పై పరిశోధన చేసి డాక్టరేట్ పొందిన సిద్ధాంత గ్రంథాన్ని ప్రచురించారా ?

ప్రస్తుతం పిహెచ్. డి సిద్ధాంత గ్రంథాల్ని ప్రత్యేకించి ప్రచురించాల్సిన పని లేదు. అవన్నీ యూ.జి.సి శోద్ గంగా అనే వెబ్ సైట్ ద్వారా పబ్లిక్ డొమైన్ లో పెడుతుంది. అంతేకాకుండా ఆయా యూనివర్సిటీలు కూడా వెబ్ సైట్ లో అందుబాటులో పెడతారు. నా గ్రంథం కూడా అలా అందుబాటులో ఉంది. నిజానికి ఆ సిద్ధాంత గ్రంథం కొన్ని పరిశోధనా పద్ధతులతో ఆ నియమాల్ని పాటిస్తూ రాయాల్సి ఉంటుంది. దాన్నే మళ్ళీ ప్రచురించే కంటే ఆ గ్రంథంతో పాటు మరికొన్ని అంశాల్ని అందించగలిగే అడ్వాన్స్ రీసెర్చ్ తో కూడిన గ్రంథాల్ని ప్రచురిస్తే బాగుంటుంది .

తెలుగు భాషా సాహిత్య పరిశోధనల్లో క్రమేపీ ప్రమాణాలు తగ్గిపోతున్నాయనే అభిప్రాయం తరచుగా వినిపిస్తోంది. దీనిపై మీ అభిప్రాయం ?

ఇటువంటి అభిప్రాయాలు పరిశోధనలు మొదలైన నాటి నుండి నేటి వరకు వస్తూనే ఉన్నాయి. నిజానికి యూనివర్సిటీ స్థాయిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం పొందడానికి పిహెచ్.డి (డాక్టరేట్) ఉండాలనే నియమం సరైనది కాదు. పరిశోధన చేయడానికి ఆ విధానాల్ని, పద్ధతుల్ని అవగాహన చేసుకోవడానికి ప్రత్యేక కోర్సు ఉత్తీర్ణులై ఉండాలని పెట్టాలి. దీనికి కారణం అత్యధిక శాతం పరిశోధకులు ఒకవైపు ఉద్యోగం కోసం అన్వేషణలో ఉంటారు. అందువల్ల ఆ పోటీ పరీక్షలకు సిద్ధమవ్వాలి. మరో వైపు సిద్ధాంత గ్రంథాలను సకాలంలో పూర్తి చేయాలి. ఆ గ్రంథాన్ని రాసే నైపుణ్యం ఆ సిద్ధాంతాల అవగాహన ఆ వయసులో ఉన్నవారికి బోధనా అనుభవం, పరిశోధన అనుభవం లేని వాళ్ళకి సరిపోవు. అందువల్ల డాక్టరేట్ తో సంబంధం లేకుండా పి.జి తరువాత ఒక రీసెర్చ్ మెథడాలజీ పూర్తి చేసిన వారికి అవకాశం కల్పించాలి. అప్పుడు ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లో వారు చేసే పరిశోధనలను ఆధారంగా ఇవ్వాలి. అప్పుడు వారికి ఆ రంగంలో అనుభవం ఉంటుంది. పరిశోధన ప్రమాణాలు పడిపోతున్నాయనే అభిప్రాయాలు కూడా తగ్గుముఖంపడతాయి.

ఆరుద్ర సినీగేయాల పై మీ అభిప్రాయం?

ఆరుద్ర సినీ గేయాల్లో కూడా అనేక అభ్యుదయ భావాలు ఉన్నాయి. అయితే అది నా పరిశోధన పరిధిలోకి రాదు. వాటిపై ప్రత్యేకంగా పరిశోధన చేయడానికి అవకాశం ఉంది. యూనివర్సిటీలల్లో తెలుగు సినీగేయ సాహిత్యం గురించి పరిశోధనలు చేశారు. అటువంటివారిలో ఆత్రేయ, శ్రీశ్రీ, ఘంటసాల, సి.నా.రె, శ్రీ వేటూరి సుందర రామమూర్తి, దాశరథి, సిరివెన్నెల సీతారామశాస్త్రి వంటి సినీ గేయాల్లోని భాషాశైలి, అభివ్యక్తి,కథా కథనం, ఆధ్యాత్మికత, భక్తి పాటలు, లాలి పాటలు, దేశభక్తి పాటలు, పిల్లల పాటలు, జానపద పాటలు, ఇలా విభిన్న అంశాలపై పరిశోధనలు చేశారు. కానీ ఆరుద్ర సినీ గేయ సాహిత్యం గురించి ప్రత్యేకంగా పరిశోధనలు చేసే అవకాశం ఉంది. ఈ విషయాలన్నింటినీ కె. రామలక్ష్మీ 'ఆరుద్ర సినీ గీతాలు' అనే సంకలనాల్ని ఐదింటికి తీసుకొచ్చారు. వీటిని విశాలాంధ్ర వారు పబ్లిష్ చేశారు.

మరి అలా అయితే, విశ్వ విద్యాలయాల్లో అధ్యాపకులు కేవలం బోధనకే పరిమితం అవ్వాలా ? అప్పుడు డిగ్రీ కళాశాల అధ్యాపకులకు, విశ్వవిద్యాలయ అధ్యాపకులకు తేడా ఏమీ అవసరం లేదా?

విశ్వవిద్యాలయంలో చేరిన వాళ్ళకు కూడా కొన్నాళ్ళ పాటు అధ్యయనం, అధ్యాపనమే ప్రధానం అవుతుంది. అవి చేస్తూనే పరిశోధన పత్రాలు రాయాలి.అందులో నిష్ణాతులైన వారే పరిశోధనలకు, పర్యవేక్షణకు అర్హత అవుతారు. వారికే ప్రమోషన్లు, కీలకమైన పదవులు ఇవ్వాలి. ఇప్పుడు కూడా కొన్ని ప్రమోషన్లకు, కీలకమైన పదవులకు కొన్ని పరిశోధనా పత్రాలు రాయడంతో పాటు పర్యవేక్షణ అనుభవం ఉండడం వంటి వాటిని ప్రమాణాలుగా తీసుకుంటున్నారు. డిగ్రీ కళాశాలలో చేరినా, యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్ వారి గుర్తింపు పొందిన నెట్, స్లెట్ వంటి పరీక్షలు ఉత్తీర్ణులైన వారికి యుజిసి శాలరీ, ఆ నియమాలే వర్తిస్తాయి. విశ్వవిద్యాలయంలో పనిచేసేవారికి కూడా ఆ శాలరీ స్లాబ్ వర్తించినా, టీచింగ్ అవర్స్ తక్కువగా ఉండి, రీసెర్చ్ అవర్స్ పెరుగుతాయి. ఇప్పుడు క్రమేపీ డాక్టరేట్ డిగ్రీతో పాటు కొన్ని నియమ, నిబంధనలు సరిపోతే వాళ్ళు కూడా రీసెర్చ్ గైడ్ గా వ్యవహరించే అవకాశాలు ఉన్నాయి. అయినప్పటికీ డాక్టరేట్ డిగ్రీ విషయంలో కొన్ని సంస్కరణలు రావాలి. అప్పుడు పరిశోధనల్లో ప్రమాణాలు పడిపోతున్నాయనే అభిప్రాయాలు క్రమేపీ తగ్గుతాయి.

ఆరుద్ర పై భవిష్యత్తులో ఇంకా ఏ యే కోణంలో పరిశోధనలు చేసే అవకాశం ఉంది?

ఆయన సినీ గీతాలు మీద ప్రత్యేకించి పరిశోధన చేయవచ్చు. సమగ్ర ఆంధ్ర సాహిత్యంలో ఆరుద్ర ప్రతిపాదించిన కొన్ని ప్రతిపాదనలపై ప్రత్యేకంగా పరిశోధన చేయవచ్చు. తెలుగులో ప్రబంధాలు, తెలుగులో పురాణాలు, తెలుగులో కథా కావ్యాలు, అష్టదిగ్గజ కవులు, రాముడికి సీత ఏమవుతుంది అనే గ్రంథంలో ఆయన చేసిన ప్రతిపాదనలు, సంప్రదాయ నృత్యాలకు జానపద విజ్ఞానంలో మాతృకలు ఉన్నాయనీ, అవే భరతుని నాట్యశాస్త్రంలో కనిపిస్తున్నాయనీ చేసిన ప్రతిపాదనలు, తెలుగులో కథానిక, నవల, నాటకం మొదలైన ప్రక్రియలలో తొలి రచనగా దేన్ని గుర్తించాలనే అంశాలు ఇలా ఎన్నో సమగ్రహాంతర సాహిత్యం నుండి తీసుకొని భవిష్యత్తులో పరిశోధన చేయవచ్చు.

తెలుగు సాహిత్యాన్ని చదివేవారికి, పరిశోధనలు చేసేవారికి, ఆరుద్ర సమగ్ర ఆంధ్ర సాహిత్యం అధ్యయనం చేయడం వలన కలిగే ప్రయోజనాలు చెప్పండి?

సృజనాత్మక పరిశోధకుడిగా ఆరుద్ర తన సమగ్ర ఆంధ్ర సాహిత్యాన్ని రచించాడని చెప్పుకున్నాం. సాహిత్య చరిత్రలు అంటే కేవలం పండితులకే కాదు, అందరూ చదువుకోవచ్చనీ, దాని ద్వారా తెలుగు సాహిత్యంలో గల వివిధ కోణాలను, ఆ భాషా సాహిత్యాలమాధుర్యాన్ని అనుభవించగలుగుతారు. కొరుకుడు పడని పద్యాలుగా ఉన్న అనేక కావ్యాల్లోని మూల విషయాలను సులభంగా అర్థం చేసుకోవడానికి సమగ్ర ఆంధ్ర సాహిత్యం దారి చూపిస్తుంది. పేరు వినడం తప్ప ఆ కావ్యంలో ఏముందో కనీసం తెలియని వారికి ఆ కావ్యంలో ఉన్న విషయాన్ని పరిచయం చేసుకోగలుగుతారు. మూల గ్రంథాలను చదవడానికి ప్రేరణ పొందుతారు. సాహిత్య చరిత్రకారులు తమ సాహిత్య చరిత్ర, వికాస చరిత్రలకు కొత్త సూత్రీకరణలను ఈ గ్రంథం నుండి స్వీకరించవచ్చు. సాహిత్య చరిత్రలలో ముడిపడిన విమర్శ తీరును ఈ గ్రంథంలో గమనించవచ్చు. తెలుగు అకాడమీ వాళ్ళు నాలుగు సంపుటాలుగా ప్రచురించిన సమగ్ర సాహిత్యం ఎంతో ఆకర్షణీయంగా ఉంది. కానీ, అంత పెద్ద పుస్తకాలుగా ప్రచురించే కంటే చిన్న పుస్తకాలుగా ప్రచురించటమే మంచిది.

ఆరుద్ర శతజయంతి సందర్భంగా ఇంటర్వ్యూ చేసిన మీకు, ప్రచురించిన పత్రిక సంపాదకులకు నా కృతజ్ఞతలు.

డా.నలసాని రామ్ ప్రసాద్,
తెలుగుశాఖ, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్,

ప్రజల కోసం ప్రాణాలు అర్పిస్తా

నిత్యం ముళ్ల ప్రయాణం నాది

ఎన్నో సమ్మెట దెబ్బలు తిన్న రాజకీయం

హత్య బెదరింపు వ్యవహారంపై శ్రీధర్ రెడ్డి

భూమిపుత్ర ,నెల్లూరు :

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేని చంపేస్తే డబ్బే డబ్బు అంటూ రౌడీ షీటర్ల సంభాషణకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.. దీనిపై సోషల్ మీడియా వేదికగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆసక్తికరమైన ట్వీట్ చేశారు. ప్రజల కోసం ప్రాణాలు అర్పించే ఉక్కు సంకల్పం నాది.. నా రాజకీయ జీవితం పూల పాన్పు కాదు.. నిత్యం ముళ్ల మీద ప్రయాణం.. ఎన్నో సమ్మెట దెబ్బలు ఓర్చుకున్న ఈ గుండె తాటాకు చప్పుళ్ళకు బెదరదు.. ప్రజా సేవలో వెనక్కు తగ్గదు.. అంటూ వ్యాఖ్య చేశారు.. ఇక, ఈ వ్యవహారంపై మీడియాతో మాట్లాడిన ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.. ప్రశాంతమైన నెల్లూరులో కొంతమంది రౌడీ షీటర్లు అరాచకాలు చేస్తున్నారు అని దుయ్యబట్టారు.. జులై 1న రౌడీ షీటర్లు కూర్చుని నన్ను చంపాలని మాట్లాడుకున్నారు.. మూడు రోజుల ముందు పోలీసులకు వస్తే.. ఎందుకు నాకు సమాచారం ఇవ్వలేదు..? అని నిలదీశారు.. అసలు, నన్ను చంపితే డబ్బు ఎవరు ఇస్తారనేది పోలీసుల విచారణలో తెలియాలన్నారు.. రాజ్యాధికారం కోసం సొంత ఇంట్లో కుటుంబ సభ్యులను చంపే సంప్రదాయం మా ఇంట్లో లేదని వ్యాఖ్యానించారు. రౌడీ షీటర్లు నా తమ్ముడు గిరిధర్ రెడ్డి అనుచరులు అని ఓ మీడియా రాసిందని మండిపడ్డారు.. విద్యార్థి దశలోనే ఎన్నో పోరాటాలు చేశాను. రౌడీలకు, గుండాలకు భయపడనన్న ఆయన.. వైఎస్ జగన్ ని ధిక్కరించి వీధుల్లోకి వచ్చి పోరాటం చేశాను.. 16 నెలలు అధికారాన్ని వదులుకుని టీ–డీపీలో చేరాను. వైస్సార్సీపీకి సవాల్ విసిరుతున్నా.. ఎన్ని దుష్ప్రచారాలు చేసినా.. వెనకడుగు వేసిదేలన్నారు.. అసలు, నన్ను చంపితే కోట్లు– రూపాయల డబ్బులు ఇస్తామని ఎవరు చెప్పారో పోలీసులు తేల్చాలని డిమాండ్ చేశారు. ఇలాంటి బెదిరింపులకు భయపడను.. నన్ను హత్య చేస్తామని మాట్లాడిన గుండాలకు మా ఇంట్లో చిన్న పిల్లలు కూడా భయపడరు.. నా చివరి శ్వాస, ఓపిక, ఊపిరి ఉన్నంత వరకు ప్రజా జీవితంలోనే ఉంటాను అని ప్రకటించారు కోటంరెడ్డి..



వైసీపీతో నాకు తీవ్రంగా విబేధాలు ఉన్నాయి.. వాళ్ల సోషల్ మీడియా నా మీద విషం చిమ్ముతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వచ్చి 14 నెలలు అవుతుంటే.. ఒక్కరికి కూడా నేను నష్టం కల్గించలేదన్న ఆయన.. అసలు, వైస్సార్సీపీ నేతలు నన్ను ఎందుకు గెలుకుతున్నారు..? అని ఫైర్ అయ్యారు.. గత ప్రభుత్వంలో సజ్జల రామకృష్ణారెడ్డి నా గన్‌మెన్‌లను తొలగించారని గుర్తుచేశారు. పోలీసులు ఎక్కడా వైఫల్యం చెందలేదు.. రౌడీయిజంపై ఉక్కుపాదం మోపుతున్నారని పేర్కొన్నారు.. పోలీసులు కఠినంగా వ్యవహరించడం వల్లే నిందితులు జైల్లులో ఉన్నారని తెలిపారు.. ఇక, వీడియోలో మాట్లాడిన ఒకరిద్దరు వ్యక్తులు నాకు తెలుసని పేర్కొన్నారు.. నా హత్యకు ఇచ్చిన సుపారీ ఎంత అనేది పోలీసులే తేల్చాలన్నారు.

దేశ రాజధాని ఢిల్లీలో దారుణం


ప్రసాదం కోసం సేవకుడిపై దాడి

దుండగుల కర్రల దాడిలో మృతి

భూమిపుత్ర ,న్యూఢిల్లీ :

దేశ రాజధాని ఢిల్లీలో ఘోరం జరిగింది. ప్రసాదం వివాదం కారణంగా ఒకరు హత్యకు గురయ్యారు. కొందరు వ్యక్తులు.. ఆలయ సేవకుడిని అత్యంత దారుణంగా కర్రలతో కొట్టి చంపేశారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీలో రికార్డ్ అయ్యారు. ప్రస్తుతం వైరల్‌గా మారాయి.

ప్రముఖ కల్కాజీ ఆలయానికి కొందరు వ్యక్తులు దర్శనానికి వచ్చారు. సందర్శన తర్వాత ఆలయ సేవకుడు యోగేంద్ర సింగ్(35)ను ప్రసాదం అడిగారు. అడగ్గానే ప్రసాదం అందజేశాడు. మరింత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందుకు యోగేంద్ర సింగ్ నిరాకరించాడు. దీంతో గొడవకు దిగారు. విచక్షణ మరిచిన గ్యాంగ్ కర్రలు తీసుకుని ఆలయ సేవకుడిపై దాడికి పాల్పడ్డారు. ఒక్కడిని చేసి మూకుమ్మడి దాడికి పాల్పడ్డారు. అక్కడికక్కడే యోగేంద్ర సింగ్ ప్రాణాలు కోల్పోయాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీలో రికార్డ్ అయ్యాయి. బాధితుడు ఉత్తరప్రదేశ్‌లోని హర్దోయ్ జిల్లాలోని ఫతేపూర్ ప్రాంతానికి చెందిన యోగేంద్ర సింగ్ (35)గా పోలీసులు గుర్తించారు. గత 14 నుంచి 15



సంవత్సరాలుగా కల్కాజీ ఆలయంలో సేవాదార్‌గా పనిచేస్తున్నాడు. భక్తులకు ఆచారాలు, నైవేద్యాల విషయంలో సహాయం చేస్తుంటాడు. కానీ కొందరు దుండగులు అకారణంగా కొట్టి చంపేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నారు. స్థానికులు బాధితుడిని ఆస్పత్రికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది.. అప్పటికే మరణించినట్లుగా వైద్యులు తెలిపారు. భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల కోసం గాలిస్తున్నారు. దక్షిణపురి నివాసి అయిన 30 ఏళ్ల అతుల్ పాండే అనే నిందితుడిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నట్లు– పోలీసులు పేర్కొన్నారు.

‘అమృత సముద్రం భగవద్గీత’

స్వామి తురీయానంద సరస్వతి

భూమిపుత్ర ,కడప :



భగవద్గీత అన్ని జ్ఞానాలకు మూలమని, తరగని ఆధ్యాత్మిక నిధియని, అనంతమైన అమృత సముద్రమని కడప చిన్మయ మిషన్ అధ్యక్షులు స్వామి తురీయానంద సరస్వతి అన్నారు

శనివారం సాయంత్రం కడప పట్టణం పాత కడపలో ‘దశమహావిద్వాన్ ‘ శ్రీ నాగేంద్ర మహోధర స్వామి, గార్ల ఆశీస్సులతో ‘సనాతన ధర్మ సామూహిక ప్రార్ధనా దేవాలయాల సంస్థ’ ప్రారంభించారు. ఈ సందర్భంగాతురీయానంద సరస్వతి సందేశం ఇస్తూ ప్రపంచంలో అన్ని ఆధ్యాత్మిక సాహిత్యాలలో భగవద్గీత తో సమానమైన, స్ఫూర్తిదాయకమైన గ్రంథము మరొకటి లేదని, గీతను అనుసరించిన మానవుడు ఉత్తమ జీవన విధానాన్ని అలవర్చుకుంటాడని అన్నారు. సభాధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ రామాయణ,భారత,భాగవతాలు నేటి సమాజానికి ఎంత ఉపయోగకరంగా ఉంటాయో స్పష్ట పరిచారు. ముఖ్య అతిథి మామిళ్ల వెంకటరమణయ్య గారి లోకనాథం ప్రసంగిస్తూ నేటి యువత ఉత్తమ జీవన విధానాన్ని అలవర్చుకోవాలంటే రామాయణం కంటే మించిన నీతి శాస్త్రం మరొకటి లేదని చెప్పి రామాయణ ప్రత్యేకతను వివరించి చెప్పారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన పసుపులేటి శంకర్ సనాతన ధర్మాన్ని గురించి చెబుతూ సనాతనమంటే ముగింపు లేనిదని, ఇది కేవలం మతం కాదని, జీవితాన్ని నడిపించే నియమమని, నిజాయితీ,దయ,సద్భావన,సత్యం వంటి సద్గుణాలను పెంపొందించుకోవడమే సనాతన ధర్మమని,ప్రతి మనిషికి భగవద్గీత పరిష్కారం చూపుతోందని, గీతలో పిరికితనం వదిలివేయమన్నారని ధైర్యంగా కర్మలను చేయమన్నారని, ఇది జీవితంలో చాలా ముఖ్యమైన విషయమన్నారు సంస్థ వ్యవస్థాపకులు కాల్వ సోమ కళానాథరెడ్డి తన ప్రసంగంలో ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణించే వారికి ఈ సంస్థ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందనే ఉద్దేశంతోనే ప్రారంభించమన్నారు.ఆత్మీయ అతిథులు కొవ్వూరు రామసుబ్బారెడ్డి,దేసు వెంకటరెడ్డి, నందారపు చెన్న కృష్ణారెడ్డి, చెన్నం శెట్టి శశి కుమార్, బండ్రెడ్డి సతీష్ కుమార్ రెడ్డి, కల్లూరు విజయానంద రెడ్డి, డాక్టర్ కృష్ణ ప్రసాద్, సనాతన ధర్మ విశిష్టతను చెప్పారు .గౌరవ అతిథులు యడవల్లి భాస్కర్ వర్మ, పట్టురీరు సూర్యనారాయణ, కె ఆర్ కె ఉమామహేశ్వర బాబు, సింగమల వెంకట రమణారెడ్డి, డాక్టర్ జి గురు ప్రసాద్, రంగిశెట్టి కీర్తి కుమార్, బ్రహ్మపురి సురేష్ కుమార్, జెకె కృష్ణ సింగ్, బి జనార్ధన్,గాజుల సుబ్రహ్మణ్యం గార్లు సనాతన ధర్మ సామూహిక ప్రార్ధన దేవాలయాల సంస్థ కార్యాచరణ గురించి తెలియజేశారు. కార్యక్రమంలో వందలాది ఆధ్యాత్మిక చింతనాపరులు, భక్తులు పాల్గొన్నారు.

మరోమారు కాళేశ్వరంపై హరీష్ పిటిషన్

పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు

భయమెందుకని ప్రశ్న

భూమిపుత్ర , హైదరాబాద్ :

మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. కాళేశ్వరం కమిషన్ నివేదికను సస్పెండ్ చేయాలని మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. అసెంబ్లీలో కాళేశ్వరం కమిషన్ నివేదికను ప్రవేశపెట్టకుండా చూడాలన్నారు. ఈ పిటిషన్ ప్రస్తుతం హైకోర్టు రిజిస్ట్రీ పరిశీలనలో ఉంది. కాళేశ్వరం కమిషన్ నివేదికను కొట్టివేయాలని గతంలోనూ కేసీఆర్, హరీశ్‌రావు పిటిషన్లు దాఖలు చేశారు. పిటిషన్ల ఆధారంగా గతంలో విచారణ చేపట్టిన హైకోర్టు.. నోటీసులు జారీ చేసి వాయిదా వేసింది. అక్టోబర్ ఈ పిటిషన్లపై తదుపరి విచారణ చేపట్టనుంది. తప్పులు చేశారో.. లేదో తేల్చాల్సింది మంత్రులు, కాంగ్రెస్ పార్టీ కాదని హరీశ్‌రావు అన్నారు. అది తేల్చాల్సింది కోర్టులు, ప్రజలు అని పేర్కొన్నారు. కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు అవకాశం ఇవ్వట్లేదంటే.. అధికార పక్షం భయపడుతున్నట్లే అని పేర్కొన్నారు. వాస్తవాలు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదని విమర్శించారు.

పీపీటీకి అవకాశం ఇవ్వడం లేదంటే.. వాస్తవాలను వినడానికి సిద్ధంగా లేరని అర్థం అవుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు అన్ని గమనిస్తున్నారని గుర్తు చేశారు. మంత్రి శ్రీధర్ బాబు మాటలు చూస్తుంటే.. ఆయనకు వాస్తవాన్ని అంగీకరించడం ఇష్టం లేదని తెలుస్తోందని అన్నారు. ఏ విషయం గురించైనా నిజానిజాలు కోర్టులో తెలుస్తాయని హరీష్ రావు స్పష్టం చేశారు.

పవర్ పాయింట్ సంప్రదాయం ఎక్కడుంది?

గతంలో మేం అడిగితే ఇవ్వలేదే- భట్టి

సమస్యలపై చర్చకు ఎప్పుడూ

సిద్ధమన్న శ్రీధర్ బాబు

భూమిపుత్ర , హైదరాబాద్ :

ప్రతిపక్షాలకు అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చే సంప్రదాయం లేదని డిప్యూటీ-సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. భారత రాష్ట్ర సమితి హయాంలో తాము పీపీటీకి అవకాశం ఇవ్వాలని లేఖ ఇచ్చినట్లు గుర్తుచేశారు. అప్పుడు తమకు ఎందుకు అవకాశం ఇవ్వలేదని ప్రశ్నించారు. అప్పుడు లేని సంప్రదాయం ఇప్పుడు ఎలా ఉంటుందన్నారు. ప్రభుత్వం రూ.6,500 కోట్ల వడ్డీ కట్టట్లేదనే భారత రాష్ట్ర సమితి వాదన సరికాదని పేర్కొన్నారు. మరి వడ్డీలు ఆ పార్టీ నేతలు కడుతున్నారా అని ప్రశ్నించారు. ప్రజలను ఎంతోకాలం తప్పుదోవ పట్టించలేరని అన్నారు. మరోవైపు శాసనసభలో కాళేశ్వరంపై పీపీటీకి అవకాశం ఇవ్వాలని భారత రాష్ట్ర సమితి నేతలు డిమాండ్ చేస్తున్నారు. తాము పూర్తి ప్రజాస్వామికంగా వ్యవహరిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు అందరికీ పూర్తిస్థాయిలో అవకాశం ఇస్తామన్నారు. తప్పులు చేసినవారికి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఎందుకు అని భారత రాష్ట్ర సమితి నేతలను ప్రశ్నించారు. తెలంగాణలోనే కాదు.. దేశం మొత్తం యూరియా కొరత ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. యూరియా కోసం సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రానికి లేఖ రాశారని చెప్పారు. కేంద్ర మంత్రులతో మాట్లాడి ఒత్తిడి తెచ్చారన్నారు. తమ ఒత్తిడితోనే యూరియా కొంత సాధిం చినట్లు వివరించారు. తెలంగాణ అభివృద్ధే లక్ష్యమని కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి అన్నారు. ఆమె పార్టీ నేతలతో కలిసి గన్ పార్క్ వద్ద నివాళి అర్పించి మాట్లాడారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వం ఒక్కొక్క సమస్యను పరిష్కరిస్తోందని వివరించారు. వరదలతో నష్టపోయిన వాళ్లను ఆదుకోవాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం అన్ని పార్టీలు ముందుకు రావాలి. కేసీఆర్ ఎందుకు అసెంబ్లీకి రావడం లేదు. ఫామ్ హౌస్‌లో ఉండటంలో అర్థం ఏమిటి? అసెంబ్లీకి రాను.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని కేసీఆర్‌ను చెప్పమనండని విజయశాంతి అన్నారు.

గన్‌పార్క్ వద్ద బిఆర్ఎస్ నిరసన

ఎరవుల కొరతపై విమర్శలు

పిసి ఘోష్ కాదు..సిసిసి ఘోష్ అంటూ

ఎద్దేవా

కాళేశ్వరం మొదలు అన్ని

అంశాలపైచర్చకు సిద్ధం

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

భూమిపుత్ర , హైదరాబాద్ :





శనివారం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న ఎరువుల సంక్షోభంపై భారత రాష్ట్ర సమితి వినూత్న నిరసన
చేపట్టింది. గన్‌పార్క్ వద్ద అమరులకు నివాళి అర్పించి అసెంబ్లీకి వచ్చారు. అమరుల స్థూపం వద్ద కాసేపునిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇందులో భాగంగా కనీసం 15 రోజులపాటు- అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆయన గన్‌పార్క్ వద్ద మీడియాతో మాట్లాడారు.. అసెంబ్లీ సమావేశాలు కనీసం 15 రోజులు లేదా అంతకు మించి నిర్వహించినా తాము సిద్ధమే అని కేటీఆర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ అంశాన్ని సభలో పెట్టినా.. అన్నింటికీ సరైన సమాధానం ఇస్తామని ధీమా వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగం నుంచి మొదలుకొని ఏ అంశం పైననైనా సభలో చర్చకు పెడితే ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు- పేర్కొన్నారు. వ్యవసాయ విస్తీర్ణంతో పాటు- వ్యవసాయ సంక్షేమానికి మాజీ సీఎం కేసీఆర్ చేసిన కార్యక్రమాలు, పథకాల గురించి వివరిస్తామని అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అయిన కాళేశ్వరం గురించి కూడా సమాధానం చెబుతామని కేటీఆర్ స్పష్టం చేశారు. అది పీసీ ఘోష్ కమిషన్ కాదు, అది కాంగ్రెస్ పార్టీ వేసుకున్న పీసీసీ ఘోష్ కమిషన్ అని కేటీఆర్ విమర్శించారు.

వ్యవసాయ రంగం నుంచి మొదలుకొని ఏ అంశం పైననైనా సభలో చర్చకు పెడితే ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాము. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అయిన కాళేశ్వరం గురించి కూడా సమాధానం చెబుతాం. అసమ్మతి ఎమ్మెల్యేలకు సంబంధించిన అంశంలో స్పీకర్ ఏ నిర్ణయం తీసుకుంటారో చూద్దాం. ఇప్పటికే అసమ్మతి ఎమ్మెల్యేలకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోంది, ఏ నిర్ణయం తీసుకుంటారో చూద్దాం అని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు శాసనసభను తమకు అనుకూలంగా ఉండేలా నడిపించే ప్రయత్నం చేస్తోంది. రైతుల సమస్యల పైన, రాష్ట్రంలో ఉన్న ఎరువుల సంక్షోభం పైన మాట్లాడటం లేదు. 10 సంవత్సరాల పాటు కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఏ రోజు కూడా ఇలాంటి ఎరువుల కొరత రాలేదు. రైతులు లైన్లలో నిలబడాల్సిన దుస్థితి రాలేదు. మరి ఎందుకు ఈరోజు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చెప్పులను లైన్లో పెట్టడం, ఆధార్ కార్డులను లైన్లో పెట్టే పరిస్థితి వచ్చింది? పండుగ రోజు కూడా రైతులు ఎరువుల కోసం లైన్లలో నిలబడి, వర్షంలో తడిసి ఇబ్బందులు పడే పరిస్థితి ఎందుకు వచ్చింది? పంట నష్టపోయిన రైతుల గురించి కానీ, భారీ వర్షాల వల్ల ఇబ్బందుల గురించి గానీ సుదీర్ఘంగా చర్చించే అవకాశం అసెంబ్లీలో ఇవ్వండి. రాష్ట్రంలో ఉన్న వ్యవసాయ సంక్షోభం పైన అసెంబ్లీలో చర్చ పెట్టాలి అని కేటీ-ఆర్ డిమాండ్ చేశారు. 600కు పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. 75 లక్షల మంది రైతులు ఈరోజు అవస్థల్లో ఉన్నారు. రైతులకు కాంగ్రెస్ చేసిన మోసంపైన అసెంబ్లీలో చర్చ జరగాలి. ఆరు గ్యారెంటీ-ల నుంచి 420 హామీల అమలు వైఫల్యాల దాకా అన్ని అంశాలపైన చర్చిద్దాం. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల వల్ల వారు ఇబ్బందులు పడుతున్నారు, వాటి పైన చర్చ జరగాలి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం తమకు అనుకూలంగా ఉండే ఒకటి రెండు అంశాల పైననే మాట్లాడే ప్రయత్నం చేస్తోంది. ప్రజల కష్టాలు, సమస్యల పైన చర్చలకు అసెంబ్లీ వేదిక కావాలి. కనీసం 15 రోజులపాటు- అసెంబ్లీ సమావేశాలు జరగాలి. కాళేశ్వరంతో పాటు- అన్ని అంశాల పైన సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నాము. పీసీ ఘోష్ కమిషన్ పైన కూడా కాంగ్రెస్ పార్టీకి సమాధానం చెప్పడానికి మేము సిద్ధంగా ఉన్నాం అని కేటీఆర్ స్పష్టం చేశారు

యూరియా కొరతపై బిఆర్ఎస్ డ్రామాలు

వ్యవసాయ మంత్రి తుమ్మల

భూమిపుత్ర , హైదరాబాద్ :

రాష్ట్రంలో యూరియా కొరత ఉందంటూ ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ చేసిన ఆందోళనపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఫైర్ అయ్యారు. యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వం కారణమని మీకు తెలియదా అంటూ ప్రశ్నించారు. కేంద్రం వల్ల యూరియా కొరత ఉంటే మాపై విమర్శలు చేస్తారా అని బీఆర్ఎస్ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదంతా కావాలని చేస్తున్న డ్రామాగా ఆయన అభివర్ణించారు. రేవంత్ సర్కార్‌ను బద్నాం చేసేందుకే బీఆర్ఎస్ దిగజారుడు రాజకీయం చేస్తోందని విమర్శించారు. యూరియా స్లపైలో నిర్లక్ష్యంపై కేంద్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. యూరియాపై బీఆర్ఎస్ నేతలది కపట నాటకమని.. బీఆర్ఎస్ నాటకాలను రైతులు నమ్మరని అన్నారు. అనవసరంగా రైతులను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో యూరియా సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం బీఆర్ఎస్ నేతలు ఆందోళనకు దిగారు. ముందుగా వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యా లయం ముందు ఆందోళనకు దిగిన బీఆర్ఎస్ నేతలు.. యూరియా సమస్యను పరిష్కరించాలని వ్యవసాయ శాఖ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం తెలంగాణ సచివాలయం ముందు బైఠాయించి ఆందోళన చేశారు. ఈ ధర్నాలో హరీష్ రావు, కేటీ-ఆర్, తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బీఆర్ఎస్ ఆందోళనతో సచివాలయం దగ్గర కాసేపు ఉద్రిక్తత నెలకొంది. దీనిపై మంత్రి తుమ్మల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపికి అనుకూలంగా బిఆర్ఎస్ కావాలనే ఆందోళన చేస్తోందన్నారు. ఎరువులు సరఫరా చేయని కేంద్రాన్ని నిలదీయకుండా గతంలో తాము అంతా గొప్పలు చేశామని చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు.

వరదలపై చర్చిద్దామంటే బురద రాజకీయం చేస్తున్నారు

రెండు రోజులంటే ఎలా

కాళేశ్వరంతో చర్చకే ప్రాధాన్యం

అందుకే బిఎసి నుంచి వాకౌట్ చేశాం

బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు

భూమిపుత్ర , హైదరాబాద్ :



రెండు రోజులే అసెంబ్లీ నడిపిస్తామని ప్రభుత్వం అంటోందని, ప్రజా సమస్యలపై చర్చించకుండా పారిపోతున్నారని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. బీఏసీ నుంచి వాకౌట్ చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వరదల గురించి చర్చిద్దామంటే బురద రాజకీయాలు చేస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలు 15 రోజుల పాటు- నిర్వహించాలని బీఏసీలో కోరాం. వరద నష్టాలు, ఎరువుల కొరత, గురుకులాల్లో వందకుపైగా మరణాలు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ గురించి అసెంబ్లీలో చర్చించాలని కోరాం అని హరీశ్‌రావు తెలిపారు. వరదల మీద మాట్లాడుదామని అంటే.. వరదలు ప్రాధాన్యత కాదు బురద రాజకీయాలు మాట్లాడుకుందామని కాంగ్రెస్ ప్రభుత్వం అంటున్నదని హరీశ్‌రావు పేర్కొన్నారు. రెండే రోజులు అసెంబ్లీ జరిపి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పారిపోవాలని చూస్తుందని ఆయన ధ్వజమెత్తారు. వరదలు, ఎరువుల మీద చర్చించాలని బీఏసీ సమావేశంలో మేం కోరాం. కానీ ఆ రెండింటి మీద చర్చించరట. అందుకే బీఏసీ నుంచి వాకౌట్ చేశాం. పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో లేని సమస్య ఇప్పుడు ఎందుకు వచ్చింది. వరదలు, యూరియా కొరతపై మాట్లాడాలని బీఆర్ఎస్ ప్రతిపాదించింది. ఈ రెండు అంశాలపై మాట్లాడాలని మేం కోరాం. వీటితో పాటు- గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేక వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. అంటు- రోగాల మీద, గురుకులాల్లో కనీస సౌకర్యాలపై, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై, ఫోర్త్ సీటి పేరు మీద జరుగుతున్న అక్రమాలు.. సీఎం కుటు-ంబ సభ్యుల పాత్రపై, ధాన్యం కుంభకోణంపై.. బాధ్యులపై, ప్రభుత్వ ఉద్యోగుల టీ-ఏ, డీఏలు, పీఆర్సీపై, గోదావరి బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై, హైడ్రా కూల్చివేతలు పేదలు పడుతున్న భాదలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీస సౌకర్యాలపై చర్చించాలని కోరాం. వీటికి ప్రభుత్వం అంగీకరించలేదు. దురదృష్టం ఏంటంటే రెండే రోజులు అసెంబ్లీ జరుపుతామని అంటున్నారు. అంటే ఇవాళ రేపు, ప్రజా సమస్యల మీద చర్చించకుండా సభను వాయిదా వేసుకొని పారిపోతున్నారు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ప్రభుత్వ ధోరణి చూస్తే కాళేశ్వరం కమిషన్ రిపోర్టు పెట్టి బురద రాజకీయాలకు పాల్పడే ఆలోచనలో కనబడుతున్నారు. దాని మీద చర్చకు సిద్ధం.. పీపీటీకి అవకాశం ఇవ్వండి.. ఒక్క రోజు కాదు నాలుగు రోజులు మాట్లాడుకుందాం అని చెప్పాం. కానీ కష్టాల్లో ఉన్న రైతులు, వరద బాధితులపై మాట్లాడాలంటే ముందుకు రావడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు విమర్శలు చేశారు. రేపు ఒక్క రోజే బీసీ బిల్లు, కాళేశ్వరం రిపోర్టుపై చర్చించి.. తర్వాత అసెంబ్లీ వాయిదా వేసుకుని పోతారట. ప్రజా సమస్యలు, రైతు సమస్యలపై ప్రభుత్వానికి చీమకుట్టినట్టు- కూడా లేదు. ఎరువుల మీద చర్చించడానికి, వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావడం లేదు. ప్రజాపాలన అంటే ప్రతిపక్షాల గొంతు నొక్కడమేనా..? ఎజెండా నిర్ణయించకపోవడమేనా..? ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. అర్థంపర్థం లేకుండా బీఏసీ సమావేశం జరిగింది. కేవలం బురద రాజకీయాలే తమకు ప్రాధాన్యత అన్న ధోరణిలో ప్రభుత్వం ఉందని హరీశ్‌రావు మండిపడ్డారు.

కాళేశ్వరం, బిసి బిల్లుపై నేడు చర్చ

మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

భూమిపుత్ర , హైదరాబాద్ :

అసెంబ్లీ సమావేశాలు ఎన్నిరోజులు నిర్వహించాలనే దానిపై ఆదివారం నిర్ణయం తీసుకుంటామని తెలంగాణ శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. శాసనసభ వ్యవహారాల కమిటీ- (బీఏసీ) సమావేశం ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై ఆదివారం సభలో చర్చ జరుగుతుందన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆదివారం సభలో పెడతాం. కాళేశ్వరంపై సభలో భారత రాష్ట్రసమితి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు స్పీకరే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. అన్ని అంశాలపై చర్చ చేయాలంటే.. నాలుగైదు రోజుల తర్వాత సభ నడుపుతాం. గణేష్ నిమజ్జనం, వరదల దృష్ట్యా సభను వాయిదా వేయాలని శ్రీధర్‌బాబు తెలిపారు. అయితే బీఏసీ సమావేశం నుంచి భారత రాష్ట్ర సమితి వాకౌట్ చేసింది. ఎరువుల కొరత, వరదలు, రైతుల సమస్యలపై చర్చ జరగాలని భారత రాష్ట్ర సమితి నేతలు డిమాండ్ చేశారు. స్పష్టమైన హామీ రాకపోవడంతో బీఏసీ నుంచి ఆ పార్టీ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు

గోదావరికి పోటెత్తిన వరద-నీట మునిగిన బాసర వీధులు

భూమిపుత్ర, ఆదిలాబాద్ :

నిర్మల్ జిల్లా బాసర వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. రెండు రోజులుగా వరద పెరగడంతో గోదావరి నుంచి సరస్వతి ఆలయం వరకు ప్రధాన రహదారి జలమయమైంది. వరదనీరు వ్యాసమహర్షి ఆలయానికి, ఆలయ ఆవరణలోని తితిదే గృహాల వరకు చేరుకుంది. ఆలయం వద్ద దుకాణాలు, ప్రైవేటు- లాడ్జిలు, సత్రాలన్నీ నీట మునిగాయి. దీంతో సరుకులు మొత్తం నీటిలో కొట్టుకు పోయాయని దుకాణదారులు విలపించారు. గంగాదేవి, సూర్యేశ్వర శివాలయం, అక్షర కాలనీ, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్‌లు జలమయమయ్యాయి. అక్షర కాలనీలో చిక్కుకున్నవారిని ట్రాక్టర్ల సహాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. స్థానిక నాగభూషణ్ విద్యాలయంలో 30 మంది విద్యార్థులు, ఆరుగురు టీ-చర్లు చిక్కుకున్నారు. వరద చుట్టు-ముట్టడంతో భవనం పై అంతస్తుకు వెళ్లి తలదాచుకున్నారు. వారిని బయటకు తీసుకొచ్చేందుకు వెళ్లి మరో 8 మంది కూడా వరదనీటిలో చిక్కుకున్నారు.

కుప్పం చేరుకున్న కృష్ణమ్మ

భూమిపుత్ర ,చిత్తూరు :

సొంత నియోజకవర్గం చిత్తూరు జిల్లా కుప్పం పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు కృష్ణమ్మకు జలహారతి ఇచ్చారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ కుప్పం మండలం పరమసముద్రం చెరువు వద్ద హంద్రీనీవా జలాలకు సీఎం జలహారతి ఇచ్చారు. పంచెకట్టుకుని సంప్రదాయ పద్ధతిలో కృష్ణమ్మకు జలహారతి కార్యక్రమంలో పాల్గొన్నారు సీఎం చంద్రబాబు.. వేద మంత్రోచ్ఛారణల మధ్య కృష్ణమ్మకు పసుపు, కుంకమ సమర్పంచి జలహారతి ఇచ్చారు.. ఈ జలహారతి కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కుప్పం స్థానిక టీడీపీ నేతలు, ప్రజలు పాల్గొన్నారు.. తమ నియోజకవర్గానికి కృష్ణా జలాలు రావడంపై సంతోషాన్ని వ్యక్తం చేస్తూ.. జై చంద్రబాబు... జైజై చంద్రబాబు అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు కుప్పం ప్రజలు..కుప్పంలో స్త్రీ శక్తి బస్సులో ప్రయాణించారు ముఖ్యమంత్రి చంద్రబాబు .. మహిళలు, రైతులతో కలిసి బస్సులో ప్రయాణించారు.. కుప్పం బ్రాంచ్ కెనాల్ వరకు మహిళలు, రైతులతో సంభాషిస్తూ బస్సులో ప్రయాణం చేశారు. స్త్రీ శక్తి పేరుతో అందిస్తున్న ఉచిత బస్సు సదుపాయం ఎలా ఉందని మహిళలను అడిగి తెలుసుకున్నారు.. తాము ఎక్కడికి వెళ్లినా ఇబ్బంది లేకుండా... ఫ్రీ బస్సులో వెళ్తున్నామని ఆనందం వ్యక్తం చేశారు మహిళలు.. చక్కటి సదుపాయాన్ని కల్పించారని.. తమకు డబ్బులు ఆదా అవుతున్నాయని సీఎంతో చెప్పారు.. హంద్రీ - నీవా ద్వారా కృష్ణా నీళ్లు తొలిసారి కుప్పానికి వచ్చాయి.. కాల్వల్లో నీళ్లు చూశారా..? చెరువులు నిండాయా అంటూ చంద్రబాబు ఆరా తీశారు.. తొలిసారి కుప్పానికి కృష్ణమ్మ వచ్చిందని... చాలా సంతోషంగా ఉందని రైతులు, మహిళలు సీఎం చంద్రబాబు తెలియజేశారు.. మొత్తంగా సీమ ప్రజల ఎన్నో ఏళ్ల కల నెరవేరింది. కరువు సీమ కాదు.. ఇక నుంచి ధాన్య రాశులను పండించే రతనాల సీమ అని చెప్పుకునే సమయం ఆసన్నమైంది. కృష్ణా జలాలు కుప్పం చేరటమే అందుకు కారణం. శ్రీశైలం నుంచి కృష్ణమ్మ వందల కిలోమీటర్లు ప్రయాణించి కుప్పం చేరుకోవడంతో రాయలసీమలో ఆనందోత్సాహం నెలకొంది. కృష్ణా జలాలు కుప్పం చేరిన వేళ జలహారతి ఇచ్చేందుకు సీఎం చంద్రబాబు శుక్రవారం కుప్పం చేరుకున్నారు. సీమకు పూర్తిస్థాయిలో కృష్ణా జలాలు అనే కలను చంద్రబాబు నిజం చేశారని కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారు. సీమలో ప్రాజెక్టులు మొదలుపెట్టింది ఎన్టీఆర్ అయితే వాటిని ముందుకు తీసుకువెళ్లింది చంద్రబాబు నాయుడు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అతి తక్కువ వర్ష పాతం ఉండే సీమ జిల్లాల్లో నీళ్లతోనే సీమ ప్రజల స్థితిగతులు మారుతాయని హంద్రీ నీవాకు ఉమ్మడి రాష్ట్రంలో 1999 జులై 9 చంద్రబాబు శంకుస్థాపన చేశారు. 2014 నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం భారీ ఎత్తున సాగునీటి ప్రాజెక్టులపై నిధుల ఖర్చు చేయడం వల్ల ఇవాళ హంద్రీనీవా నీళ్లు చిత్తూరు జిల్లాలో చివరి ఆయకట్టు- భూములకు చేరాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాగు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందనే లక్ష్యంతో హంద్రీనీవా ప్రాజెక్టుపై 2014-19 మధ్య రూ.4,183 కోట్లు- ఖర్చు పెట్టారు చంద్రబాబు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రికార్డు స్థాయిలో కేవలం 100 రోజుల్లో మెయిన్ కెనాల్ విస్తరణ, లైనింగ్ పనులు పూర్తి చేసి ప్రధాన కాలువ సామర్థ్యాన్ని 3850 క్యూసెక్కులకు పెంచారు. హంద్రీనీవా కాల్వ విస్తరణ పనులతో సీమకు జలకళ వచ్చింది. ఈ ప్రాజెక్టు ద్వారా మొత్తంగా 6 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీరు అందుతోంది. విస్తరించిన కాల్వల ద్వారా పరుగులు పెడుతున్న కృష్ణమ్మ 19 నియోజకవర్గాలను తాకింది. 10 రిజర్వాయర్‌లను నింపుతోంది. కర్నూలు జిల్లాలో కృష్ణగిరి, పత్తికొండ, అనంతపురం జిల్లాలో జీడిపల్లి, పెన్నా అహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లు నిండాయి. సత్యసాయి జిల్లాలో మారాల, గొల్లపల్లి, చెర్లోపల్లి... అన్నమయ్య జిల్లాలోని శ్రీనివాసాపురం, అడవిపల్లి రిజర్వాయర్లు నిండుతున్నాయి. అలాగే గాజుల దిన్నెకు నీరు చేరింది. హంద్రీనీవా ఆయకట్టు-లో చిట్ట చివరి జిల్లా చిత్తూరు. చిత్తూరు జిల్లాలో 16 లక్షల ఎకరాల సాగుభూమి ఉన్నా... కేవలం 6 లక్షల ఎకరాలకే సాగునీరు అందుతోంది. మిగిలిన 10 లక్షల ఎకరాలకు సాగునీరిస్తే...రైతన్నకు నీటి కొరతే ఉండదు. హంద్రీనీవా రెండో దశ పనులు పూర్తి చేసి జిల్లాలోని 2.20 లక్షల ఎకరాలకు సాగునీరు ప్రభుత్వం ఇవ్వనుంది. పీలేరు, పుంగనూరు, చంద్రగిరి, పూతలపట్టు-, చిత్తూరు, జీడీ నెల్లూరు నియోజకవర్గాల ప్రజలకు దీంతో ప్రయోజనం కలుగుతుంది. జులై 17న కర్నూలు జిల్లా మల్యాల ఎత్తిపోతల నుంచి నీటిని విడుదల చేశారు. నాటి నుంచి హంద్రీనీవా కాలువల్లో ప్రవహించిన కృష్ణమ్మ 738 కి.మీ ప్రయాణించి కుప్పానికి చేరింది. పరమ సముద్రంలో సీఎం చంద్రబాబు కృష్ణా జలాలకు హారతి ఇవ్వడంతో కల నెరవేరింది. ప్రభుత్వ చిత్తశుద్ధి సంకల్పంతో 40 టీ-ఎంసీల నీటిని ఒక్క హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా రాయల సీమ జిల్లాలు వినియోగించుకోనున్నాయి. చెరువులు అన్ని నింపే కార్యక్రమాన్ని ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించింది. దీంతో సీమలో భూగర్భ జలాలు పెరగనున్నాయి. ఉద్యాన పంటల ఉత్పత్తులు పెంచేందుకు సాగునీటి సౌకర్యం ఎంతో దోహదం చేయనుంది.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు జీవో

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సెప్టెంబర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ఎన్నికల కమిషన్‌కు తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో శనివారం భేటీ- అయిన తెలంగాణ కేబినెట్ పలు కీలక నిర్ణయాలు చేసింది. స్థానిక ఎన్నికల రిజర్వేషన్లలో పరిమితి ఎత్తివేయాలని కూడా కేబినెట్ నిర్ణయించింది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాం పేర్లను గవర్నర్‌కు క్యాబినెట్ సిఫార్సు చేసింది. అసెంబ్లీ కమిటీ-హాలులో జరిగిన ఈ మంత్రివర్గ సమావేశంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంతోపాటు-, ఇటీ-వలి వర్షాలు, వరదలతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంపైనా చర్చించారు. పంటలు, రోడ్లు, ఇతర నష్టాలపై కేంద్ర ఆర్థికశాఖ సాయం కోరుతూ తీర్మానం చేశారు. కేబినెట్ వివరాలను మంత్రి పొంగులేటి మీడియాకు వివరించారు. మరోవైపు సెప్టెంబర్ 30లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఇప్పటికే హైకోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి కూడా క్యేబినెట్ నిర్ణయం తీసుకుందని అన్నారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు సెప్టెంబర్‌లోగా జరపాలని కోర్టు ఆదేశించింది. మొత్తం రిజర్వేషన్ల పరిమితి 50 శాతానికి మించకూడదని గత ప్రభుత్వం 2018 ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. దీనిపై ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం ఆర్డినెన్స్ చేసి గవర్నర్ కు పంపింది. ప్రస్తుతం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతి దగ్గర పెండింగ్ లో ఉందన్నారు. ముస్లీం కోటా పేరుతో బీజేపీ బిల్లును అడ్డుకుంటోంది. రాష్ట్రపతి ఆమోదం తెలపకుండా ప్రధాని మోదీ సర్కార్ అడ్డుకుంటోంది. కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా 42 శాతం రిజర్వేషన్లకు ఆమోదం తెలపాలని ఢిల్లీలో నిరసన కూడా తెలిపినట్లు వెల్లడంచారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ లుగా కోదండరాం, అజారుద్దీన్ పేర్లను సిఫారసు చేస్తూ తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు తీర్పుతో కేబినెట్ మరోసారి గవర్నర్ కోటా ఎమ్మెల్సీల పేర్లను సిఫారసు చేసింది. అయితే కోదండరాం పేరుతో పాటు- ఈ సారి అమీర్ అలీ ఖాన్ స్థానంలో అజారుద్దీన్ కు స్థానం కల్పించాలని నిర్ణయించారు. ఎమ్మెల్సీలుగా కోదండరాం, ఆమిర్ అలీఖాన్ నియామకాన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ 2024 ఆగస్టులో సుప్రీంకోర్టులో సివిల్ అప్లికేషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్ ను విచారించిన సుప్రీం కోర్టు.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంలో ప్రొఫెసర్ కోదండరాం, ఆమిర్ అలీ ఖాన్ కేసు విషయంలో 2025 ఆగస్టు 13 న స్టే విధించింది. 2024 ఆగస్టు 14న తాము ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల తర్వాత జరిగిన పరిణామాలు ఆ ఉత్తర్వులకు వ్యతిరేకంగా ఉంటే ఎమ్మెల్సీల నియామకాన్ని రద్దు చేస్తామని వ్యాఖ్యానించింది. అయితే.. ఏదైనా తుది ఉత్తర్వులకు లోబడే ఉంటుందని స్పష్టం చేస్తూ.. తదుపరి విచారణను 2025 సెప్టెంబర్17కు వాయిదా వేసింది. ఈ క్రమంలో మరోసారి గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పేర్లను సిఫారసు చేసింది తెలంగాణ కేబినెట్.. ఎమ్మెల్సీలుగా కోదండరాం, అజారుద్దీన్ పేర్లను ఖరారు చేసింది. అయితే ఈ సారి అమీర్ అలీ ఖాన్ ప్లేసులో అజారుద్దీన్ కు అవకాశం కల్పించింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో అజారుద్దీన్ కు ఎమ్మెల్సీ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. దీంతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ తరపున కొత్త అభ్యర్థికి అవకాశం రానుంది. ఇకపోతే బీసీ రిజర్వేషన్లపై కేబినెట్‌లో కీలక చర్చ జరిగిందని, అసెంబ్లీలో రిజర్వేషన్ బిల్లులను ఆమోదిస్తాం అని పొంగులేటి అన్నారు. భారీ వర్షాలతో కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో భారీ నష్టం వాటిల్లింది. పంట, ఆస్తి, రహదారుల నష్టం అధికంగా జరిగింది. వరద నష్టాన్ని అంచనా వేయాలని అధికారులకు చెప్పాం. వర్షాల వల్ల జరిగిన నష్టం అంచనాల పై సెప్టెంబర్ 4న ఉన్నతాధికారుల సమావేశం నిర్వహిస్తాం అన్నారు. గోలల పాలసీ విధి విధానాలపై చర్చించాం. 2022 - 23 లో రబీ ధాన్యం సేకరణకు టెండర్లు పిలిచారు. మిల్లర్లకు ఇచ్చిన 7లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రికవరీ కాలేదు.. వారి పై పీడీ యాక్ట్ పెట్టడాని-కై-నా ప్రభుత్వం వెనకాడదు. మత్స్య సహకార సంఘాలకు పర్సనల్ ఇంచార్జీలను నియమించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్ట్ కు కేబినెట్ ఆమోదం తెలిపిందని అన్నారు.

'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో బాలకృష్ణ పేరు

భూమిపుత్ర , హైదరాబాద్ :

ప్రముఖ నటుడు బాలకృష్ణ కు అరుదైన గౌరవం దక్కింది. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (గోల్డ్ ఎడిషన్)లో ఆయన పేరు చేరింది. భారతీయ చలన చిత్ర పరిశ్రమలో ఈ పురస్కారానికి ఎంపికైన తొలి నటుడిగా బాలయ్యబాబు నిలిచారు. ఆయన సినీ కెరీర్‌కు 50 ఏళు పూర్తయిన సంగతి తెలిసిందే. ఇప్పటికీ హీరోగా కొనసాగుతుండడం విశేషం. ఈ మేరకు ఆయన అవార్డుకు ఎంపికయ్యారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన వేడుకలో బాలకృష్ణ ఈ పురస్కారం అందుకున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్, ఏపీ మంత్రి నారాలోకేశ్ తదితరులు హాజరయ్యారు.



ఒక చరిత్ర రాయాలన్నా, దాన్ని తిరిగి రాయాలన్న ఒక్క బాలయ్య బాబుతోనే సాధ్యమని ఏపీ మంత్రి లోకేశ్ అన్నారు. అందరికీ బాలయ్యబాబు అయితే, తనకు ముద్దుల మావయ్య అని పేర్కొన్నారు. 50ఏళ్లు సినిమా రంగంలో.. అదే విధంగా రాజకీయాల్లోనూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న వ్యక్తి అని కొనియాడారు. "బాలయ్యబాబు ఎప్పుడూ యంగ్ అండ్ ఎనర్జిటిక్‌గానే ఉంటారు. 110 సినిమాలు చేశారు. ఒక మూవీ ఏకంగా 1000 రోజులు ఆడింది. తన కెరీర్‌లో ఎన్నో జానర్స్‌లో మూవీస్ చేశారు. చారిత్రక, జానపద, ఆధ్యాత్మిక, సైన్ ఫిక్షన్ ఏదైనా సరే బాలయ్య న్యాయం చేస్తారు. నా పాదయాత్రలో బాలకృష్ణ సినిమా సంభాషణలు చాలా వాడాను. బాలయ్యబాబు భోళాశంకరుడు, అందుకే సినీ పరిశ్రమ ఆయన్ని అమితంగా ప్రేమిస్తుంది. బాలయ్య సినీ ప్రస్థానం ఎన్నో ఒడిదొడుకులతో కూడుకున్నది. బాలకృష్ణలోని మానవత్వానికి నిదర్శనం బసవతారకం ఆస్పత్రి. బాలకృష్ణలాంటి మరో వ్యక్తి సినీ పరిశ్రమలో లేరు. ఓటీటీలోనూ ఆయన అద్భుతంగా రాణించారు. నిజంగానే ఆయన అన్ స్టాపబుల్. బాలకృష్ణకు వరల్డ్ బుక్ ఆఫ్ రివార్డు దక్కడం తెలుగు జాతికి గర్వకారణం" అని మంత్రి లోకేశ్ అన్నారు.

ప్రజాస్వామ్యంలో హింస పనిచేయదు

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్యేలతో నిలబడేందుకు తనకు పుష్కర కాలం పట్టిందని పవన్ కల్యాణ్ అన్నారు. పదవి, అధికారం అనే ఆశ లేకుండా మన దేశం, మన మూలాలను పరిరక్షించుకోవాలనే సంకల్పం కార్యకర్తలకు ఉంటే జనసేన కచ్చితంగా నేషనల్ పార్టీ అవుతుందని పవన్ కల్యాణ్ అన్నారు. ఈ సందర్భంగా పార్టీకి సంబంధించిన ఐదు విషయాలను పవన్ ప్రస్తావించారు. పార్టీని సంస్థాగతంగా నిర్మించేందుకు పార్టీ కార్యాలయం నుంచి మండల స్థాయి వరకు మానిటర్ చేస్తానని పవన్ కల్యాణ్ ప్రకటించారు

తాను ఎప్పుడూ నిస్వార్థంగానే పని చేసుకుంటూ వెళ్లానని, తన పని సత్ఫలితాలు ఇవ్వాలని కోరుకున్నానని పవన్ కల్యాణ్ అన్నారు. అందరూ బాగుండాలనేదే తన ఉద్దేశమని స్పష్టం చేశారు. కమ్యూనిజంను నినదించిన రష్యా ప్రజాస్వామ్య దేశంగా మారిందని పవన్ గుర్తు చేశారు. సెక్యూలరిజాన్ని తాము అర్థం చేసుకున్నామని అన్నారు. కమ్యూనిజం, సోషలిజం అన్ని అర్థం చేసుకున్న తర్వాతే పార్టీ ఏర్పాటు చేశామని తెలిపారు. సినిమాలు చేసి, డ్యాన్సులు చేసేవారికి అవగాహన ఉండదనుకుంటున్నారా అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. సంపూర్ణ అవగాహనతోనే తాము మాట్లాడామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని అన్నారు. గుండెల్లో ఉండే మాటే తూటా కావాలని సూచించారు.

చివరగా నిలబడేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉంటే వారి వెన్నంటి ఉండి, నడిపించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని పవన్ కల్యాణ్ ప్రకటించారు. తనకు దశాబ్దకాలం ఇస్తే నాయకులుగా, దేశనిర్మాణంలో కీలక శక్తులుగా తీర్చిదిద్దే బాధ్యత తాను తీసుకుంటానని కార్యకర్తలకు పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు.

సభలో అంతరాయాలతో ఎంపీలకే నష్టం

(మొదటిపేజీ తరువాయి)

ఆ పార్టీల ఎంపీలు ఒత్తిడి తేవాలన్నారు. గొడవలు, అంతరాయాలకు పాల్పడితే చివరకు అది పార్లమెంటు సభ్యులకే నష్టం కలిగిస్తుందన్నారు. అంతరాయం కలిగించాలంటూ నేతలు ఇచ్చే ఆదేశాలను అడ్డుకోవాలని యువ ఎంపీలకు కేంద్ర మంత్రి సూచించారు.

"ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యంలో పార్లమెంటరీ వ్యవస్థ" అన్న అంశంపై కర్ణాటక హైకోర్టు న్యాయవాదులు ఏర్పాటు చేసిన సభలో రిజిజు మాట్లాడుతూ.. "సభలో గందరగోళం సృష్టించడం తప్పితే చర్చల్లో పాల్గొనేందుకు ఆసక్తి చూపని నేతపై ఒత్తిడి తేవాలి. సభలో అంతరాయం కలిగిస్తే సభ్యులకే నష్టం. ప్రభుత్వానికి కాదు. అవసరమైనప్పుడు ప్రభుత్వం బిల్లులను ప్రవేశపెడుతుంది. చివరకు సభ్యులే నష్టపోతారు. ముఖ్యంగా ప్రతిపక్ష సభ్యులు" అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

ఇటీవల ముగిసిన వర్షాకాల సమావేశాలను ప్రస్తావించిన రిజిజు.. చర్చల్లో పాల్గొనాలని విపక్ష పార్టీలకు అనేకసార్లు విజ్ఞప్తి చేశామని గుర్తుచేశారు. సభా కార్యకలాపాలకు సంబంధించి ప్రతిరోజు ఉదయమే జాబితా సిద్ధమవుతుందని, ఏయే అంశాలు చర్చించాలి, ఎంత సమయం అనే విషయాన్ని ముందస్తుగా నిర్ణయిస్తారన్నారు. కానీ, నేతల సూచనల మేరకు ఆయా విపక్ష పార్టీ సభ్యులు సభలో నడుచుకుంటారని, తద్వారా అంతరాయం కలిగిస్తారని అన్నారు. ఈ విషయంపై యువ ఎంపీలు ఆలోచన చేయాలని, చర్చల్లో పాల్గొనాలని సూచించారు.

ఉగ్రవాదుల లాజిస్టిక్స్ నెట్‌వర్క్ బాగు ఖాన్ హతం!

(మొదటిపేజీ తరువాయి)

అనుకూల, ప్రతికూల పరిస్థితుల్లో ఏమి చేయాలో అతనికి పూర్తి జ్ఞానం ఉంది. అందుకే అతను అన్ని ఉగ్రవాద గ్రూపులకు ముఖ్యుడిగా భావిస్తుంటారు. హిజ్బుల్ కమాండర్‌గా ఉన్నప్పుడు , గురెజ్, నియంత్రణ రేఖలోని పొరుగు ప్రాంతాల నుండి చొరబాట్లను ప్లాన్ చేయడంలో, అమలు చేయడంలో బాగు ఖాన్ దిట్ట. భారత్‌లోకి చొరబడే ఉగ్రవాద సంస్థలకు సహాయం చేశాడని భద్రతా దళాలు తెలిపాయి.

సంవత్సరాల తరబడి భద్రతా దళాల నుండి తప్పించుకున్న తర్వాత, బండిపోరాలోకి చొరబడటానికి ప్రయత్నించిన ఉగ్రవాది బాగు ఖాన్‌ను సైన్యం హతమార్చింది. ఈ ఎన్‌కౌంటర్‌లో మరో ఉగ్రవాది హతమయ్యాడు. బాగు ఖాన్‌ను నిర్మూలించడం ఈ ప్రాంతంలోని ఉగ్రవాద సంస్థల లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌కు పెద్ద దెబ్బ. రెండు రోజుల క్రితం భారత సైన్యం ఈ ఆపరేషన్ నిర్వహించింది.

గురువారం (ఆగస్టు 28) జమ్మూ కాశ్మీర్‌లోని బండిపుర జిల్లాలోని గురెజ్ సెక్టార్‌లోని నియంత్రణ రేఖ (ఎల్ఓసి) వద్ద చొరబడటానికి ప్రయత్నిస్తున్న బాగు ఖాన్‌ను భద్రతా దళాలు కనుగొన్నాయి. నిఘా సమాచారం ఆధారంగా, భద్రతా దళాలు ఇక్కడ ఉగ్రవాదుల కోసం వెతకడానికి ఆపరేషన్ ప్రారంభించాయి. ఈ సమయంలో బాగు ఖాన్‌తో పాటు మరో ఉగ్రవాదిని భద్రతా దళాలు హతమార్చాయి. మరుసటి రోజు ఆగస్టు 29 ఉదయం వరకు ఆ ప్రాంతంలో కాల్పులు, సెర్చ్ ఆపరేషన్ కొనసాగింది.?? "అప్రమత్తమైన దళాలు అనుమానాస్పద కదలికలను గమనించి చొరబాటుదారులను అడ్డుకున్నాయి. దీనితో ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. దళాలు ప్రతిదాడి చేసి ఇద్దరు ఉగ్రవాదులను హతమార్చాయి" అని భారత సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది.

యూరియా కొరతపై బిఆర్ఎస్ ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

ముట్టడించారు. సచివాలయం ప్రధాన గేటు- వద్ద బైఠాయించారు. యూరియా కొరత తీర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో సచివాలయం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు- చేశారు. యూరియా సంక్షోభానికి కారణం కాంగ్రెస్ పార్టీ అంటూ నినాదాలు చేశారు. పండగపూట కూడా రైతన్నలను రోడ్లపై నిలబెట్టింది ఈ ప్రభుత్వం అని ధ్వజమెత్తారు. గణపతి బప్పా మోరియా - కావాలయ్యా యూరియా అంటూ నినదించారు. రైతన్నలకు ఎరువులు సరఫరా చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే దిగిపోవాలని నినాదాలు చేశారు. రైతన్నలకు యూరియా వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ దోషం - రైతన్నకు మోసం అంటూ నినాదాలు చేశారు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.

గుండెపోటుతో కార్డియాలజీ వైద్యుడు మృతి

విధుల్లో ఉండగానే కుప్పకూలి మృత్యువాత

భూమిపుత్ర, చెన్నై :



విధుల్లో ఉండగానే తమిళనాడుకు చెందిన కార్డియాక్ సర్జన్ డా.గ్రాడ్లిన్ రాయ్ (39) గుండెపోటు-తో ప్రాణాలు కోల్పోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చెన్నైలోని ప్రైవేటు- ఆసుపత్రిలో కార్డియాక్ సర్జన్‌గా పనిచేస్తున్న డా. గ్రాడ్లిన్ రాయ్ బుధవారం విధుల్లో భాగంగా ఆసుపత్రి వార్డుల్లో రౌండ్స్‌లో ఉండగా ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. అతడిని కాపాడడానికి సహోద్యోగులు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని.. గ్రాడ్లిన్ రాయ్ ప్రాణాలు కోల్పోయారని ఆసుపత్రి అధికారులు పేర్కొన్నారు. కార్డియాలజీపై అవగాహన ఉండి.. అన్నిరకాల జాగ్రత్తలు తీసుకునే కార్డియాక్ సర్జన్ గుండె పోటుతో మరణించడం ఆందోళనకరమైన విషయమని సహచర డాక్టర్లు పేర్కొన్నారు. గ్రాడ్లిన్ రాయ్‌కు ఎలాంటి అనారోగ్య సమస్యలు కూడా లేవన్నారు. యువతలో హఠాత్తుగా సంభవిస్తున్న గుండెపోటు- మరణాలకు ఒత్తిడి, దీర్ఘకాలిక పని గంటలే కారణమని పలువురు నిపుణులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. వైద్యులు రోజుకు 12-18 గంటలు పనిచేయాల్సి వస్తుందని.. కొన్నిసార్లు ఒకే షిఫ్ట్‌లో 24 గంటలు కూడా విధుల్లో ఉండాల్సి వస్తుందన్నారు. అందువల్ల వారిపై ఒత్తిడి అధికంగా ఉంటు-ందన్నారు. మరికొందరిలో అనారోగ్యకరమైన జీవనశైలి, శారీరక వ్యాయామం లేకపోవడం వంటి అనేక కారణాలు కూడా ఉండొచ్చని తెలిపారు.

ఎమోషనల్ స్టోరీ లైన్‌లో ఘాటీ



స్టార్ బ్యూటీ అనుష్క శెట్టి లీడ్ రోల్‌లో నటిస్తున్న తాజా చిత్రం 'ఘాటి' ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేసింది. దర్శకుడు క్రిష్ జాగర్లమూడి తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ఎప్పుడు ఎప్పుడు విడుదల అవుతుందా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఈ సినిమా పలు కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. ఇక ఇప్పుడు ఈ చిత్రం సెప్టెంబర్ 5న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అయింది. ఈ చిత్రానికి సంబంధించిన ప్రమోషన్స్ కూడా శరవేగంగా జరుపుతున్నారు. ఈ క్రమంలో ఈ చిత్రం తాజాగా సెన్సార్ పనులు కూడా ముగించుకుంది. కాగా ఈ సినిమాకు సెన్సార్ బోర్డు యూ/ఎ సర్టిఫికెట్ జారీ చేసింది. ఈ సినిమాలో శీలవతి పాత్రలో అనుష్క స్టన్నింగ్ పర్ఫార్మెన్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకోనుందని చిత్ర యూనిట్ చెబుతోంది. ఈ చిత్ర రన్-టైమ్‌ను 2 గంటల 37 నిమిషాలకు లాక్ చేశారు మేకర్స్. కాగా ఈ సినిమాలోని యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రేక్షకులను థ్రిల్ చేస్తాయని చిత్ర యూనిట్ వెల్లడించింది. ఈ సినిమా కథ ఎమోషనల్ జర్నీగా ప్రారంభమై, ఇంటర్వెల్ వరకు సున్నితంగా నడిచినప్పటికి, ఇంటర్వెల్ తర్వాత మాత్రం ఆడియన్స్‌ను పూర్తిగా షాక్‌కు గురిచేయడం ఖాయం అంటున్నారు. ఇంటర్వెల్ తర్వాత కథ ఒక్కసారిగా అతి తీవ్ర యాక్షన్ మోడ్ లోకి వెళ్లి, గంజాయి మాఫియా నేపథ్యం పై రగిలే కథతో ప్రేక్షకులను సీట్ ఎడ్జ్‌లో కూర్చోబెట్ట నుందట. కోట్లాది అభిమానులను సంపాదించు కున్న అనుష్క పెద్దగా సినిమాలు చేయక పోవడంతో, ఆమె అభిమానులు కొత్త సినిమా కోసం చాలా రోజులుగా ఎదురు చూస్తున్నారు.


చిరుతో...వెంకటేశ్ చేరేది అప్పడే



'మన శంకరవరప్రసాద్ గారు'గా సంక్రాంతి బరిలో సందడి చేయనున్నారు కథానాయకుడు చిరంజీవి. ఆయన -టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. నయనతార కథానాయిక. హీరో వెంకటేశ్ ఇందులో ప్రత్యేక పాత్రలో సందడి చేయనున్నట్లు- అనిల్ ఇప్పటికే ప్రకటించారు. ఈ సినిమా కోసం ఆయన వచ్చే నెల మధ్య నుంచి సెట్లోకి అడుగు పెట్టనున్నట్లు- సమాచారం. హైదరాబాద్‌లో మొదలు కానున్న ఈ కొత్త షెడ్యూల్ కోసం ఇప్పటికే సన్నాహాలు మొదలయ్యాయి. ఈ కథలో వెంకీ పాత్రకు ఎంతో ప్రాధాన్యత ఉందని.. చిరుతో పాటతో పాటు- యాక్షన్ సీక్వెన్స్‌లోనూ భాగమయ్యే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. వినోదం, యాక్షన్ అంశాల మేళవింపుతో సాగే ఈ కుటుంబ కథా చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతమందిస్తున్నారు.

సురభిచిత్ర

అంచనాలు పెంచిన మిరాయ్ ట్రైలర్



ఈ మధ్యకాలంలో వందల కోట్ల బడ్జెట్‌తో రూపొందుతున్న సినిమాలు కూడా గ్రాఫిక్స్ విషయంలో నెటిజన్లను మెప్పించలేక ట్రోలింగ్ బారిన పడుతున్నాయి. కానీ యంగ్ హీరో తేజ సజ్జ పరిమిత బడ్జెట్‌లోనూ వావ్ ఫ్యాక్టర్ ఉన్న విజువల్ సినిమాలతో సూపర్ హీరోగా ఎదుగుతున్నాడు. 'హనుమాన్' తర్వాత ఆయన జాగ్రత్తగా సినిమాలు ఎంచుకుని, పాన్ ఇండియా ప్రేక్షకులకు యూనివర్సల్ కంటెంట్ అందిస్తున్నాడు. తాజాగా, కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో తెరకెక్కిన 'మిరాయ్' ట్రైలర్ రిలీజ్ అయింది. కేవలం మూడు నిమిషాల -ట్రైలర్ మాత్రమే అయినా, సినిమాపై అంచనాలను విపరీతంగా పెంచింది.

ప్రారంభం నుండి ముగింపు వరకు ప్రతి ఫ్రేమ్ గూస్‌బంప్స్ ఇచ్చేలా ఉంది. ఈ మధ్యకాలంలో ఇంత యునానిమస్ పాజిటివ్ రెస్పాన్స్ పొందిన -ట్రైలర్ మరొకటి రాలేదని చెప్పాలి. -ట్రైలర్‌లో హీరో తేజ సజ్జ, విలన్ కోసం వెతికే తొమ్మిది శక్తివంతమైన గ్రంథాలు, వాటిని అడ్డుకునే యోధుడి పోరాటం, ఎనర్జిటిక్ యాక్షన్ స్టంట్స్, అడ్వెంచర్ ఎలిమెంట్స్ అందించిన విధంగా సన్నివేశాలు ఉన్నాయి. యోధుడిగా కనిపించబోతున్న తేజ.. మరోసారి సూపర్ హీరోగా -ట్రైలర్‌తో సక్సెస్ అయ్యాడు. -ట్రైలర్ చివర్లో శ్రీరాముడు షాట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ విజువల్ ఎఫెక్ట్స్ విషయంలో సోషల్ మీడియాలో ప్రశంసలు పొందుతోంది. ఈ సినిమాలో డైనమిక్ హీరో మంచు మనోజ్, సీనియర్ హీరోయిన్ శ్రియ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మొత్తంగా, ఈ ఫాంటసీ యాక్షన్-అడ్వెంచర్ సినిమా పాన్ ఇండియా ప్రేక్షకులకు అంచనాలను పెంచుతూ, సెప్టెంబర్ 12న బాక్సాఫీస్ దగ్గర సెన్సేషన్ క్రియేట్ చేయడానికి సిద్ధంగా ఉంది.

లెజెండరీ యాక్టర్ వాయిస్‌తో 'రామాయణ' ఫస్ట్ పార్ట్‌కు ముగింపు



ఏ ఏదైనా సినిమాను, కథను రెండు భాగాలు చెప్పాల్సి వచ్చినప్పుడు మొదటి భాగం ఎక్కడ ముగిస్తారన్నది చాలా ముఖ్యం 'బాహుబలిని కట్టప్ప ఎందుకు చంపాడు' అన్న ప్రశ్న 'బాహుబలి' విజయంలో కీలక పాత్ర పోషించింది. ఇప్పుడు అందరికీ తెలిసిన ఇతిహాస గాథను బాలీవుడ్‌లో 'రామాయణ'గా తీర్చిదిద్దుతున్న సంగతి తెలిసిందే. రెండు భాగాలుగా రానున్న ఈ మూవీ ఫస్ట్ పార్ట్ వచ్చే ఏడాది దీపావళి కానుకగా విడుదల కానుంది. మరి ఈ భాగం ఏ సన్నివేశంతో ముగిస్తారన్న ఆసక్తి అందరిలోనూ నెలకొంది. దానిపైనే చిత్ర బృందం స్పష్టత ఇచ్చింది. రాముడికి సీత జాడ గురించి 'జటాయువు' ఇచ్చే సందేశంతో ఫస్ట్ పార్ట్‌ను ముగిస్తారట. 'రామాయణ మొదటి భాగం జటాయువు మరణంతో ముగుస్తుంది. జటాయువుకు అమితాబ్ బచ్చన్ వాయిస్ ఓవర్ ఇస్తారు. ఈ సన్నివేశంతో సీతాదేవిని ఎవరు అపహరించారో రాముడికి తెలుస్తుంది. అసలు యుద్ధం పార్ట్-2లో ఉంటుంది' అని చిత్ర బృందం తెలిపింది.

ఈ చిత్రంలో రావణాసురుడి పాత్రను కన్నడస్టార్ యశ్ పోషిస్తున్న సంగతి తెలిసిందే. రావణుడి క్రూరత్వం, దయ, కనికరంలేని రాక్షస రాజుగా ఈ పాత్రను పూర్తిగా ఆవిష్కరిస్తారట. అందుకోసం ప్రత్యేకంగా కొన్ని సన్నివేశాలను డిజైన్ చేసున్నారు. అసలు రావణబ్రహ్మ నేపథ్యాన్ని ఒళ్లు గగురుపొడిచేలా తెరపై ఆవిష్కరించనున్నారు. ఈ విషయాన్ని రామాయణ టీమ్ స్వయంగా పంచుకుంది. దాదాపు రూ.4 వేల కోట్లతో తెరకెక్కుతున్న 'రామాయణ'కు నితీశ్ తివారి దర్శకత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ , సీతగా సాయి పల్లవి నటిస్తున్నారు. తొలిభాగం 2026 దీపావళికి, రెండోభాగం 2027 దీపావళికి రానున్నాయి.

'రెండు భాగాలుగా రానున్న ఈ చిత్రాన్ని సుమారు రూ.4000 కోట్లతో రూపొందించనున్నాం. ప్రపంచమంతా ఈ ఇతిహాసాన్ని చూడాలన్న లక్ష్యంతోనే భారీ స్థాయిలో రూపొందిస్తున్నాం. హాలీవుడ్ చిత్రాలకు అయ్యే ఖర్చు కంటే ఇది తక్కువే అని నేను భావిస్తున్నాను. తరాలు మారినా, యుగాలు మారినా రామాయణం ఎప్పటికీ గొప్ప ఇతిహాసమే" అని నిర్మాత నమిత్ మల్హోత్ర చెబుతున్నారు.

భూమిపుత్ర మైదానం

రాజస్థాన్ రాయల్స్‌కు రాహుల్ ద్రవిడ్ గుడ్ బై!



రాజస్థాన్ రాయల్స్ హెడ్ కోచ్ పదవి బాధ్యతల నుంచి రాహుల్ ద్రవిడ్ తప్పుకున్నాడు. ఈ విషయాన్ని రాజస్థాన్ రాయల్స్ ఎక్స్ వేదికగా ప్రకటించింది. రాజస్థాన్ రాయల్స్ మేనేజ్‌మెంట్ ఇచ్చిన అదనపు బాధ్యతలను స్వీకరించేందుకు ద్రవిడ్ నిరాకరించినట్లు పేర్కొంది. రాహుల్ ద్రవిడ్ అందించిన సేవలకు రాజస్థాన్ రాయల్స్ కృతజ్ఞతలు తెలిపింది. పింక్ జెర్సీలో మీ ఉనికి యువ ఆటగాళ్లతో పాటు అనుభవజ్ఞులకు కూడా స్ఫూర్తినిచ్చింది. మీరు ఎప్పటికీ ఒక రాయల్. మీ సేవలకు ధన్యవాదాలు'అనే క్యాప్షన్‌తో వీడ్కోలు పోస్ట్‌ను షేర్ చేసింది. మరో పోస్ట్‌లో హెడ్ కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ పదవి కాలం ముగిసిందని పేర్కొంది. 'రాజస్థాన్ రాయల్స్ జట్టు హెడ్ కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ పదవి కాలం ముగిసింది. రాహుల్ చాలా ఏళ్లుగా రాజస్థాన్ రాయల్స్ ప్రయాణంలో కీలక వ్యక్తిగా ఉన్నారు. ఆయన నాయకత్వం ఒక తరాన్ని ప్రభావితం చేసింది. జట్టులో బలమైన విలువలను నింపింది. ఫ్రాంచైజీ సంస్కృతిపై చెరగని ముద్ర వేసింది. ఫ్రాంచైజీ నిర్మాణ సమీక్షలో భాగంగా.. రాహుల్‌కు అదనపు బాధ్యతలు ఇవ్వాలని మేనేజ్‌మెంట్ నిర్ణయించింది. కానీ ఆయన అందుకు నిరాకరించారు. రాజస్థాన్ రాయల్స్‌తో పాటు ఆటగాళ్ళు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది అభిమానులు రాహుల్ ద్రవిడ్ సేవలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.'అని పేర్కొంది. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ తరపున 46 మ్యాచ్‌లు ఆడిన ద్రవిడ్.. గతేడాది హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. టీ20 ప్రపంచకప్ 2024 అనంతరం టీమిండియా హెడ్ కోచ్ బాధ్యతల నుంచి తప్పుకున్న ద్రవిడ్.. ఐపీఎల్‌లో కోచ్‌గా రీఎంట్రీ ఇచ్చాడు. అతని పర్యవేక్షణలో రాజస్థాన్ రాయల్స్ 14 మ్యాచ్‌లకు 4 మాత్రమే గెలిచింది.

మారని తెలుగు టైటాన్స్ తీరు





సీజన్లు గడుస్తున్నా.. కెప్టెన్లు మారినా.. కొత్త ఆటగాళ్లు వచ్చినా.. తెలుగు టైటాన్స్ రాత మాత్రం మారడం లేదు. ప్రొకబడ్డీ లీగ్ 12వ సీజన్‌ను కూడా తెలుగు టైటాన్స్ ఓటమితోనే ప్రారంభించింది. సాగర తీరం విశాఖ వేదికగా అంగరంగ వైభవంగా శుక్రవారం మొదలైన ఈ టోర్నీలో తెలుగు టైటాన్స్ తీవ్రంగా నిరాశపర్చింది. తొలి మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 35-38 తేడాతో తమిళ తలైవాస్ చేతిలో ఓటమిపాలైంది. విజయం కోసం ఆఖరి వరకు పోరాడినా ఫలితం దక్కలేదు. దేశ్వార్ 12 పాయింట్లతో తలైవాస్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. పవన్ సెహ్రావత్ 9 పాయింట్స్ సాధించాడు. తెలుగు టైటాన్స్ తరపున భరత్ హుడా 11 పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఫస్టాఫ్‌లో ఇరు జట్లూ హోరా హోరీగా తలపడగా.. తలైవాస్ 14-13తో స్వల్ప ఆధిక్యంలో నిలిచింది. సెకండాఫ్‌లో పుంజుకున్న టైటాన్స్ ప్రత్యర్థిని ఆలౌట్ చేసి 19-14తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. కానీ సెహ్రావత్ అద్భుత ప్రదర్శనతో తలైవాస్ పుంజుకుని 28-28తో స్కోర్‌ను సమం చేసింది. అనంతరం మరింత దూకుడుగా ఆడిన ఆ జట్టు విజయం కైవసం చేసుకుంది. బెంగళూరు బుల్స్, పుణెరి పల్టాన్ మధ్య జరిగిన రెండో మ్యాచ్ 32-32తో టై అయ్యింది. ఫలితం నిర్ణయించేందుకు కొత్త రూల్స్ ప్రకారం 5 రైడ్స్ ఆడించగా.. పుణెరి 6-4తో విజయం సాధించింది. బెంగళూరులో ఆకాశ్ షిండే(12) రాణించగా.. పుణెరి తరపున ఆదిత్య షిండే(9) సత్తా చాటాడు. ఈ టోర్నీని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రారంభించగా.. యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ, అథ్లెట్ జ్యోతి యర్రాజి ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. నేడు జరిగే పోటీల్లో యూపీ యోధాస్‌తో తెలుగు టైటాన్స్, గుజరాత్ టైటాన్స్‌తో యు ముంబా తలపడనుంది.



చిన్నస్వామి వద్ద తొక్కిసలాట ఘటనలో మృతుల కుటుంబాలకు ఆర్సీబీ నష్టపరిహారం





బెంగళూరులో జరిగిన తొక్కిసలాట ఘటనలో మృతుల కుటుంబాలకు ఆర్సీబీ యాజమాన్యం నష్టపరిహారం ప్రకటించింది. ఐపీఎల్ 2025 ట్రోఫీ నెగ్గిన తర్వాత, జూన్ 4న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం బయట తొక్కిసలాట జరిగింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయాన్ని సెలబ్రేట్ చేసుకోవడానికి వేలాది మంది అభిమానులు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియానికి వచ్చారు. అయితే ఈ సమయంలో స్టేడియంలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తూ, పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లు దూకి వెళ్లారు. ఈ క్రమంలో అభిమానుల మధ్య చిన్నస్వామి స్టేడియం బయట జరిగిన తొక్కిసలాటలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ తొక్కిసలాట ఘటనపై దాదాపు 3 నెలల తరువాత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీ స్పందించింది. ఇది అనుకోకుండా జరిగిన దురదృష్టకర సంఘటనగా పేర్కొన్న ఆర్సీబీ తాజాగా శనివారం, ఆగస్టు 30న భారీ ప్రకటన చేసింది. చిన్నస్వామి వద్ద జరిగిన తొక్కిసలాటలో చనిపోయిన 11 మంది కుటుంబాలకు ఒక్కొక్కరికి 25 లక్షల రూపాయలు నష్టపరిహారంగా అందిస్తామని ప్రకటించారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఆర్సీబీ కేర్స్ ప్రారంభించింది. తమ సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ షేర్ చేయడం ద్వారా ఈ విషయాన్ని ప్రకటించింది. ఐపీఎల్ ఫ్రాంచైజీ బెంగళూరు కేర్స్ పేరుతో ఒక మంచి పనిని ప్రారంభించింది. 'జూన్ 4, 2025న మా హృదయాలు ముక్కలయ్యాయి. బెంగళూరు కుటుంబానికి చెందిన 11 మంది సభ్యులను కోల్పోవాల్సి వచ్చింది. వారు ఎప్పటికీ ఆర్సీబీ ఫ్యామిలీలో భాగం. ఇది మన నగరం (బెంగళూరు), మన సొసైటీ. మన జట్టును అందరి నుంచి ఇది వేరు చేస్తుంది. తొక్కిసలాటలో చనిపోయిన వారి జ్ఞాపకాలు మన హృదయాలలో ఎప్పటికీ నిలిచి ఉంటాయి' అని ఆర్సీబీ పోస్ట్ చేసింది. సోషల్ మీడియా హ్యాండిల్స్ ద్వారా కీలక వ్యాఖ్యలు చేసింది. 'ఎంత డబ్బు ఇచ్చినా చనిపోయిన మనుషులు లేరన్న లోటును తీర్చలేము. కానీ మొదటి అడుగుగా బెంగళూరు ఆ వ్యక్తుల కుటుంబాలకు ఒక్కొక్కరికి 25 లక్షల రూపాయలు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. ఇది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు. వారి కుటుంబాల సంరక్షణకు ఒక వాగ్దానం' అని పేర్కొంది.

భూమిపుత్ర

www.bhumimedia.com

తెలుగు దినపత్రిక

అనంతపురము/ శ్రీ సత్య సాయి జిల్లా

31 ఆదివారం ఆగస్ట్ 2025

చరిత్రలో ఎప్పటికీ పరిటాల రవి పేరు వినపడుతుంది

ఊపిరి ఉన్నంతవరకు పెనుకొండ ప్రజలను మరిచిపోము

పరిటాల రవీంద్ర విగ్రహావిష్కరణలో పరిటాల సునీత, శ్రీరామ్

మంత్రి సవిత ఆధ్వర్యంలో పరిటాల రవి విగ్రహావిష్కరణ

వేలాదిగా పాల్గొన్న అభిమానులు, కార్యకర్తలు

భూమిపుత్ర ,పెనుకొండ :

పెనుకొండ అంటే పరిటాల రవి.. పరిటాల రవి అంటే పెనుకొండ అని.. ఈ ప్రాంత ప్రజలను ఊపిరి ఉన్నంతవరకు మరచిపోమని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. పెనుకొండ నియోజకవర్గ కేంద్రంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆధ్వర్యంలో పరిటాల రవీంద్ర విగ్రహావిష్కరణ వేలాదిమంది అభిమానులనడుమ జరిగింది. పెనుకొండ నియోజకవర్గానికి వచ్చిన ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్, కుటుంబ సభ్యులకు అభిమానులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత మాజీ మంత్రి పరిటాల రవీంద్ర విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు, మడకశిర ఎమ్మెల్యే రాజుతో పాటు ఎంపీ పార్థసారథి ఇతర టిడిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు వేల సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ... పెనుకొండ నియోజకవర్గానికి తమకు విడదీయరాని బంధం ఉందని అన్నారు. ఆరోజు పరిటాల రవీంద్ర రాజకీయ ప్రస్థానాన్ని ఇక్కడి నుంచే ప్రారంభించారని గుర్తు చేశారు. ప్రతిరోజు సూర్యుడు ఉదయించి అస్తమిస్తాడని.... కానీ పరిటాల రవీంద్ర అస్తమించని సూర్యుడు అని కవి చెప్పిన మాటలను గుర్తు చేశాడు. తాను పరిటాల రవిని పెనుకొండలో ఎప్పుడు చూడలేదని కానీ ఇప్పుడు ఈ విగ్రహావిష్కరణ చేసిన తర్వాత ప్రతిరోజూ చూసే అవకాశం లభించింది అన్నారు. ఈ అవకాశం కల్పించిన మంత్రి సవితకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఆరోజు మీ అందరి సహకారంతో పరిటాల రవీంద్ర రాజకీయాలు నడిపారని.. ఆ తర్వాత మీ భిక్షతోనే తాము కూడా రాజకీయాలు చేస్తున్నామన్నారు. పరిటాల రవి హత్య తర్వాత పరిటాల సునీత రాజకీయ అరంగేట్రం సమయంలో డబ్బుల సంచులు తీసుకొచ్చినా.. కొడవళ్ళతో బెదిరించినా... ఏడు మంది తుపాకుల తూటాలకు బలైనా... ఇక్కడి ప్రజలు ఆమెను ముందుకు నడిపించారన్నారు. అలాంటి ఈ ప్రజలను తాము ఊపిరి ఉన్నంత వరకు మరిచిపోమని శ్రీరామ్ స్పష్టం చేశారు.





బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి పరిటాల రవి.. మంత్రి సవిత

పరిటాల రవి జీవితం మొత్తం పేద వర్గాల పక్షాన నిలబడ్డారని మంత్రి సవిత అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అన్న ఎన్టీఆర్ ఎంతో కృషి చేశారన్నారు. ఆయన బాటలో నడిచిన పరిటాల రవి పేదల బాగు కోసం తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. వెనుకబడిన అనంతపురం జిల్లా అభివృద్ధి కోసం రవన్న చేసిన సేవలు మరువలేనివన్నారు. పరిటాల రవి బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా చరిత్రలో నిలిచిపోయారన్నారు. పేదల గుండెల్లో రవన్న చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. సమ సమాజ నిర్మాణం కోసం ఆయన చేసిన సేవలు భావి తరాలకు తెలియజేయాలన్న సంకల్పంతో పెనుకొండలో కాంస్య విగ్రహం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆ మహనీయుడి కాంస్య విగ్రహం ఏర్పాటుతో తన జీవితం ధన్యమైందన్నారు. తన కుటుంబానికి, పరిటాల రవి కుటుంబానికి సత్సంబంధాలున్నాయన్నారు. తన రాజకీయ అరంగేట్రం రవన్న సూచన, స్ఫూర్తితోనే జరిగిందన్నారు. పరిటాల రవి చూపిన దారిలోనే ఆయన సతీమణి, ఎమ్మెల్యే సునీత, తనయుడు శ్రీరామ్ పనిచేస్తూ, పేదల అభ్యున్నతి కోసం రేయింబవళ్లు కృషి చేస్తున్నారని మంత్రి సవిత కొనియాడారు

నిమజ్జనంలో అపశృతులు లేకుండా చూసుకోవాలి

ప్రజలకు ఎమ్మెల్యే దగ్గుపాటి సూచన

తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులకు ఎమ్మెల్యే ఆదేశం

భూమిపుత్ర ,అనంతపురం:



పోలీసు నిబంధనలు పాటిస్తూ వినాయక నిమజ్జనంలో పాల్గొనాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. ఆదివారం నగరంలో వినాయక నిమజ్జనం జరుగుతున్న నేపథ్యంలో మండపాల నిర్వాహకులకు, ప్రజలకు పలు అంశాలపై విజ్ఞప్తి చేశారు. నగరంలో జరిగే శోభాయాత్రను ప్రజలంతా వీక్షించే విధంగా పోలీసులు తగిన ఏర్పాట్లు చేశారన్నారు. మండపాల నిర్వాహకులు కచ్చితంగా పోలీసులు నిబంధనలు పాటించాలన్నారు. పోలీసులు, ఇతర అధికారులు నిర్ణయిం చిన విధంగా రాచానపల్లి, పంపనూరు సమీపంలో విగ్రహాలను నిమజ్జనం చేయాలన్నారు. ఊరేగింపులో ట్రాఫిక్ కు ఇబ్బంది లేకుండా నిర్వాహకులు చూసుకోవాలన్నారు. డీజేలు ఇతర వాటి విషయంలో పోలీసులు సూచనలు పాటించాలన్నారు. నిమజ్జనం సమయంలో కాలువ వద్ద పిల్లలు, వృద్ధులు లేకుండా చేసుకోవాలన్నారు. అలాగే పోలీసులు సూచించిన సమయంలోనే నిమజ్జనం పూర్తి చేయాలన్నారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలకు, అపశృతులకు పోలీసులు జాగ్రత్తలు తీసుకోవాలని.. అలాగే ప్రజలు కూడా ఇందుకు సహకరించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

నీళ్లు ఇవ్వమంటే సినిమా సెట్టింగులు వేశారు

జగన్ పై ఎమ్మెల్యే పరిటాల సునీత విమర్శలు

కానీ ఈ రోజు ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పానికి నీళ్లు ఇచ్చారు

కనగానపల్లి మండలంలో హంద్రీనీవా కాల్వ వద్ద జలహారతి

చంద్రబాబు కృషి పట్ల రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్న సునీత

భూమిపుత్ర,రాప్తాడు :

కుప్పం ప్రాంత ప్రజలు తమ ప్రాంతానికి నీళ్లు ఇవ్వమంటే.. గతంలో జగన్ రెడ్డి సినిమా సెట్టింగులు వేసి డ్రామాలకు తెర లేపారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పానికి హంద్రీనీవా నీళ్లు చేరుకున్న నేపథ్యంలో ఆయన ఇవాళ జలహారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందుకు సంఘీభావంగా కనగానపల్లి మండలం, తగరకుంట సమీపంలోని హంద్రీనీవా కాలువ వద్ద ఎమ్మెల్యే సునీత పుష్పాభిషేకం, జలహారతి కార్యక్రమం చేపట్టారు. స్థానిక రైతులు, మహిళలు, టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కృష్ణా జలాలకు ప్రత్యేక పూజలు చేసి జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ఎక్కడో ఉన్న శ్రీశైలం నుంచి కుప్పం వరకు హంద్రీనీవా కాలువ ద్వారా నీళ్లు తీసుకెళ్లారంటే దీని వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. గత కొన్నేళ్లుగా మా నియోజకవర్గానికి హంద్రీనీవా నీరు అందుతోందని.. ఇప్పుడు కూడా ప్రధాన చెరువులతో పాటు గొలుసు కట్టు చెరువులకు కూడా నీరు ఇస్తున్నారన్నారు. తమ ప్రాంత రైతులతో పాటు అన్ని ప్రాంతాల వారు సంతోషంగా ఉండాలన్నదే తమ అభిమతం అన్నారు. ఇప్పుడు కుప్పం ప్రాంత రైతుల ఆనందం చూస్తుంటే.. మా ప్రాంత రైతులు కూడా సంతోష పడుతున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు మా ప్రాంతాలకు నీరు ఇస్తూ.. ఆ తర్వాత తన నియోజకవర్గానికి నీరు తీసుకెళ్లారన్నారు. గతంలో జగన్ రెడ్డి ఆర్భాటంగా చంద్రబాబు కుప్పానికి నీరు తీసుకురాలేదని.. నేను తీసుకొచ్చానంటూ డ్రామాలు చేశారన్నారు. కానీ ఆ రోజు కాల్వల్లో మట్టితో సహా కొట్టుకుపోయిన సంగతి అందరికీ గుర్తుందన్నారు. చంద్రబాబు జగన్ రెడ్డిలా షోలు చేసే వ్యక్తి కాదని.. శాశ్వత పరిష్కారం దిశగా ఇప్పుడు పూర్తి స్థాయిలో నీరు ఇచ్చి చూపిస్తున్నారని ఎమ్మెల్యే సునీత అన్నారు...





నిమజ్జనానికి పటిష్ట భద్రతా చర్యలు

భూమిపుత్ర ,అనంతపురం:



నగరంలో నేడు జరిగే గణేష్ నిమజ్జనం కార్యక్రమం ప్రశాంతంగా ముగిసేలా పటిష్ట చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, వి పేర్కొన్నారు. ప్రజలు, ఉత్సవ కమిటీలు... మరీ ముఖ్యంగా యువత ఇందుకు సహకరించాలని కోరారు. ఆనందంగా, సంతోషకర వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు. శోభాయాత్ర, నిమజ్జనం నేపథ్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయమని జిల్లా %బ్రా% గారిని కోరడం జరిగిందన్నారు. బందోబస్తులో భాగంగా పోలీసు సిబ్బందితో పాటు అత్యాధునిక సి.సి కెమెరాలు, డ్రోన్ కెమెరాలను ఉపయోగిస్తున్నట్లు తెలియజేశారు. . క్రమ పద్ధతిలో విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు కమిటీ సభ్యులు సహకరించాలని, సకాలంలో నిమజ్జన ప్రక్రియ జరిగేందుకు కమిటీల తరపున వాలంటీర్లను నిమజ్జన ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. శోభాయాత్ర ప్రాంభం నుండే తగు జాగ్రత్తలు తీసుకుని ఇతరులకు ఇబ్బంది కల్గకుండా నిర్దేశించిన రూట్లలో కొనసాగాలన్నారు. బాణసంచా కాల్చడం చేయరాదన్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు, మహిళలు, పిల్లలు పాల్గొనే ప్రదేశాల్లో మరింత జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. నిమజ్జనం ప్రదేశాలలో వద్ద పోలీసు సిబ్బందితో పాటు ఈతగాళ్లను, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బందిని, ఫైర్ సర్వీస్ సిబ్బందిని ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు

ఘనంగా పరిటాల రవీంద్ర జయంతి

భూమిపుత్ర,రాప్తాడు :



మాజీ మంత్రి పరిటాల రవీంద్ర జయంతి వేడుకలు రామగిరి మండలం వెంకటాపురంలోని పరిటాల ఘాట్ వద్ద ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే పరిటాల సునీత ధర్మవరం టీడీపీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ తో పాటు ఇతర కుటుంబ సభ్యులు పరిటాల ఘాట్ వద్ద ప్రత్యేక పూజలు చేసి ఘనంగా నివాళులర్పించారు. ఘాట్ వద్ద పరిటాల రవికి ఇష్టమైన ఆహారాన్ని పెట్టారు. కాసేపు మౌనం పాటించారు. పరిటాల రవి బ్రతికిన రోజులను గుర్తు చేసుకొని కుటుంబ సభ్యులు ఉద్వేగానికి గురయ్యారు. ఆ తర్వాత గ్రామంలో ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడ అభిమానులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి పరిటాల ఘాటు వద్ద ఘనంగా నివాళులర్పించారు. పరిటాల రవి మరణించి 20 ఏళ్లు గడిచినా ఇప్పటికి ఈ స్థాయిలో అభిమానిస్తున్నారంటే... ఆయన చేసిన సేవా కార్యక్రమాలు, పోరాటాలే కారణమని ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ అన్నారు. పరిటాల రవి ఆశయ సాధన కోసం తామంతా కృషి చేస్తామని ప్రాంతంలో నీటి సమస్య లేకుండా చేయడమే తన లక్ష్యమన్నారు. అభిమానులు జై పరిటాల రవి, జోహార్ పరిటాల రవి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

కీశే.పల్లె ఉమ కు ఘన నివాళులు

జనసంద్రంగా పల్లె వ్యవసాయ క్షేత్రం

భారీగా తరలివచ్చిన ప్రముఖులు, ప్రజలు

పెద్ద ఎత్తున రక్తదానం, అన్నదానం ,వస్త్ర దాన కార్యక్రమాలు

భూమిపుత్ర,రాప్తాడు :

మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సతీమణి కీశే పల్లె ఉమా 7వ వర్ధంతి అత్యంత వైభవంగా నిర్వహించారు. రాప్తాడు మండలం ప్రసన్నాయన పల్లి సమీపంలోని పల్లె వ్యవసాయ క్షేత్రంలో కీశే.పల్లె ఉమ ఘాట్ వద్ద మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి కుటుంబ సభ్యులు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ,పీవీ కేకే ఇంజనీరింగ్ కళాశాలల చైర్మన్ పల్లె వెంకటకృష్ణ కిషోర్ రెడ్డి కుటుంబ సభ్యులు వియాన్ , వన్యా , మాజీ మంత్రి పల్లె వియ్యంకులు కేరళ మాజీ డిజిపి శంకర్ రెడ్డి ,ఆయన సతీమణి సౌభాగ్య రాణి,పల్లె కుటుంబ సభ్యులు ,బంధువులు మిత్రులు హాజరై ఘనంగా నివాళులర్పించారు. పల్లె ఉమా వర్ధంతి సందర్భంగా అనంతపురం,సత్యసాయి ఉమ్మడి జిల్లాల నుంచి ప్రముఖులు, ఎమ్మెల్యేలు ఎమ్మెస్ రాజు ,అమిలినేని సురేంద్రబాబు,ఎంపీ పార్థసారథి, సత్యసాయి టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజనప్ప,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, నగర మాజీ మేయర్ స్వరూప డిప్యూటీ మేయర్ గంపన్న ,ఎడిసిసి బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి ,డిసిఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, జిల్లా గ్రంథాలయ సంస్థల మాజీ చైర్మన్ గౌస్ మొద్దీన్,టీడీపీ క్రిస్టియన్ జిల్లా అధ్యక్షులు స్వామి దాస్ , సింగల్ విండో అధ్యక్షులు సావిటీటి సంఘం అధ్యక్షులు, పుట్టపర్తి నియోజవర్గ టీడీపీ ,బీజేపీ ,జన సేన,కాంగ్రెస్ ,వైసీపీ , బీఎస్పీ పార్టీల నాయకులు, కార్యకర్తలు అభిమానులు పుట్టపర్తి నియోజకవర్గ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

ఈ సందర్భంగా పల్లె ఉమా జీవిత చరిత్రకు సంబంధించిన ఫోటో ప్రదర్శనను బాలాజీ ఎడ్యుకేషన్ సొసైటీ సిబ్బంది ఆధ్వర్యంలో ఎంతో చక్కగా ఏర్పాట్లు చేశారు. అక్కడికి విచ్చేసిన ప్రతి ఒక్కరిని ఈ ఫోటో ప్రదర్శన ఎంతో ఆకట్టుకుంది.

అనంతరం రక్తదాన శిబిరంలో టిడిపి శ్రేణులు పల్లె అభిమానుల తో పాటు పలువురు అభిమానులు రక్తదానం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.





దిగ్విజయంగా సేవా కార్యక్రమాలు నిర్వహించిన పీవీకేకే విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్, సిబ్బంది

పల్లె ఉమా వర్ధంతి సందర్భంగా పీవీ కేకే విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్ ఆధ్వర్యంలో సిబ్బంది పలు సేవా కార్యక్రమాలు అత్యంత దిగ్విజయంగా నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ వైభవ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. విఐపిల ఆహ్వానం మరియు భోజనం ఏర్పాట్లను కళాశాలల ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి,అనురాగ్ ,ప్రిన్సిపాల్స్ సుబ్బారావు, మన్మథేశ్వర్ రెడ్డి ,సంతోష్ కుమార్ రెడ్డి , మనోహర్ రెడ్డి ,బండి రమేష్ బాబు, ధనుంజయ రెడ్డి, శర్మ, రాఘవేంద్ర, ప్రకాష్, డిగ్రీకళాశాల రమణ, ఇంతియాజ్ , కరీం ,పలువురు అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో సివిల్ రైట్స్ డే అవగాహన సదస్సులు



భూమిపుత్ర ,అనంతపురం:

జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు జిల్లాలో పోలీసులు పౌర హక్కుల దినోత్సవం (సివిల్ రైట్స్ డే) నిర్వహించారు. ప్రతి నెల చివరి రోజున పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జిల్లాలోని పలు పోలీసు స్టేషన్ల పరిధుల్లో పోలీస్, రెవెన్యూ అధికారులు ఆయా గ్రామాలను సందర్శించి అవగాహన సదస్సులు నిర్వహించి చట్టాల గురించి వివరించారు. అసమానతలు, అంటరానితనం, కుల వివక్షతను నిర్మూలించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ... ఈదిశగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు, రెవెన్యూ అధికారులు గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

మీ కోసం సేవలను వినియోగించుకోండి

సెప్టెంబర్ 01వ తేదీన కలెక్టరేట్ లో
ప్రజా సమస్యల పరిష్కార వేదిక
కార్యక్రమం నిర్వహణ
జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

భూమిపుత్ర ,అనంతపురం:

మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.
అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

సెప్టెంబర్ 01వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నా మన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జి.ఎస్.డబ్ల్యు.ఎస్ పెండింగ్ ను త్వరగా పూర్తి చేయాలి

వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్
డాక్టర్ వినోద్ కుమార్

భూమిపుత్ర ,అనంతపురం:

జి.ఎస్.డబ్ల్యు.ఎస్ అంశాల పెండింగ్ ను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం అనంతపురం నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జి.ఎస్.డబ్ల్యు.ఎస్, తదితర అంశాలపై ఎంపీడీవోలు, తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాలు (జి.ఎస్.డబ్ల్యు.ఎస్) అంశాలలో భాగంగా కౌశలం సర్వేకి సంబంధించి జిల్లాకు 1,14,145 మంది సర్వే చేపట్టాలని లక్ష్యం కేటాయించగా, ఇప్పటివరకు 44,292 మంది సర్వే పూర్తి చేయగా, ఇంకా పెండింగ్ ఉన్న 69,853 మంది సర్వేని రోజుకు 10,000 చొప్పున లక్ష్యం నిర్దేశించుకుని వేగవంతంగా చేపట్టాలన్నారు. తల్లికి వందనం పేమెంట్ పెయిల్యూర్ రిపోర్ట్ కి సంబంధించి పెండింగ్ ఉన్న ఆధార్ మ్యాపింగ్ ను పూర్తి చేయాలన్నారు. తల్లికి వందనం సంబంధించి మదర్, చైల్డ్ ఈకేవైసీ పెండింగ్ ను, గ్రీవెన్స్ పెండింగ్ ను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. మన మిత్ర క్యాంపెయిన్ లో హౌస్ హోల్డ్ పెండింగ్ కు సంబంధించి రోజువారి పురోగతిని మరింత పెంచాలన్నారు. సిటిజన్స్ ఈ కేవైసీ రిపోర్ట్, ఆధార్ సీడింగ్ ఫర్ వాహన్ డేటా, ఏపీ సేవా సర్వీసెస్ చార్జెస్ పెండింగ్ ను వేగంగా పూర్తి చేయాలని



ఆదేశించారు. సచివాలయ ఉద్యోగుల బయోమెట్రిక్ అటెండెన్స్ పూర్తిగా నమోదయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు.

భూ సేకరణ పనులపై దృష్టిని సారించాలి

ఏజెంట్ స్పేస్ నందు డాక్యుమెంట్ అప్లోడ్
వేగవంతం చేయండి
జిల్లా కలెక్టర్ డా. వినోద్ కుమార్

భూమిపుత్ర ,అనంతపురం:

ఏజెంట్ స్పేస్ నందు డాక్యుమెంట్ అప్లోడ్, పిఎం కుసుమ్ యోజన పథకంలో భాగంగా పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు సంబంధించి భూసేకరణ పనులపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. వినోద్ కుమార్, అధికారులను ఆదేశించారు.
శనివారం సాయంత్రం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి డీఆర్ఓ మాలోల, నియోజక వర్గ అధికారులు, ఆర్డీఓ లు, తహశీల్దార్లు, ఎంపిడిఓ లు పలువురు జిల్లా అధికారులు,ఏపీ ఎస్పీడీసీఎల్ తదితరులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పీఎం కుసుమ్, ఏజెంట్ స్పేస్ తదితర అంశాల పురోగతిపై సమీక్షించి పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పిఎం కుసుమ్ యువజన పథకం ఆవశ్యకత గురించి వివరించారు. అనంతరం మాట్లాడుతూ ఈ పథకం ద్వారా రైతులు తమ పంటలను సాగు చేయడానికి సౌర శక్తిని ఉపయోగించుకునే విధంగా మరియు వ్యవసాయ పద్ధతుల్లో అనేక మార్పులు ప్రయోజనాలు పొందేందుకు ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ముఖ్యంగా ఐదు కిలోమీటర్ల దగ్గరగా ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సబ్ స్టేషన్ ఉన్నచోట భూసేకరణ పనులు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.
కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లు నాణ్యతగా లోపాలు లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఏజెంట్ స్పేస్ పోర్టల్ నందు సంబంధిత శాఖలకు చెందిన పలు డాక్యుమెంట్లు అప్లోడ్ పనులను జాగ్రత్తగా త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. 65 శాఖలకు లాగ్ ఇన్ ఐడి లు ఇవ్వడం జరిగిందని అందులో డేటా అప్లోడ్ చేసే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.మరి ముఖ్యంగా అన్ని శాఖ అధికారులు ముఖ్యమైన ప్రత్యుత్తరాల లేఖలు, కోర్టు కేసులు, (సీనియర్ సిటిజనులకు సంబంధించినవి మినహాయింపు) ప్రభుత్వ జీవోలు, ప్రొసీడింగులు, సర్కులర్ లు, టెండర్లు, ఉద్యోగ ప్రకటనలు, పిజిఆర్ఎస్ ఫిర్యాదులు మరియు పరిష్కార లేఖలు, ఎండార్స్మెంట్స్ తదితర వాటిని ప్రతిరోజు 100కు పైగా అప్లోడ్ చేయాలని, అన్ని శాఖలకు సంబంధించి ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకుని త్వరిత గతిన అన్ని డాక్యుమెంట్లు అప్లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

గణేష్ నిమజ్జనానికి పటిష్ట భద్రతా చర్యలు

భూమిపుత్ర ,అనంతపురం:

నగరంలో నేడు జరిగే గణేష్ నిమజ్జనం కార్యక్రమం ప్రశాంతంగా ముగిసేలా పటిష్ట పోలీసు బందోబస్తు చేపట్టామని జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ %శ్రూ% గారు పేర్కొన్నారు. ప్రజలు, ఉత్సవ కమిటీలు... మరీ ముఖ్యంగా యువత పోలీసులతో సహకరించాలని కోరారు. ఆనందంగా, సంతోషకర వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు. శోభాయాత్ర, నిమజ్జనం నేపథ్యంలో అనంతపురం పోలీస్ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బందోబస్తులో భాగంగా పోలీసు సిబ్బందితో పాటు అత్యాధునిక సి.సి కెమెరాలు, డ్రోన్ కెమెరాలను ఉపయోగిస్తున్నామని తెలిపారు. క్రమ పద్ధతిలో విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు కమిటీ సభ్యులు సహకరించాలని, సకాలంలో నిమజ్జన ప్రక్రియ జరిగేందుకు కమిటీల తరపున వాలంటీర్లను నిమజ్జన ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. శోభాయాత్ర ప్రాంభం నుండే తగు జాగ్రత్తలు తీసుకుని ఇతరులకు ఇబ్బంది కల్గకుండా నగర పోలీసులు సూచించిన రూట్లలో కొనసాగాలన్నారు. బాణసంచా కాల్చడం చేయరాదన్నారు. అసాంఘిక శక్తులు, అల్లరిమూకలపై ప్రత్యేక నిఘా ఉంచామని... అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు, మహిళలు, పిల్లలు పాల్గొనే ప్రదేశాల్లో మరింత జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. నిమజ్జనం ప్రదేశాలలో వద్ద పోలీసు సిబ్బందితో పాటు ఈతగాళ్లను, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బందిని, ఫైర్ సర్వీస్ సిబ్బందిని ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు

శోభాయాత్ర జిల్లా పోలీసుల సూచనలు..

అధిక శబ్దం కలిగించే సౌండ్ సిస్టమ్స్ను పరిమితిలోనే వాడండి.

ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించండి, రహదారులపై వాహనాలను అడ్డుగా నిలపవద్దు.

నిమజ్జన సమయంలో పోలీసుల సూచనలు, మార్గదర్శకాలు పాటించండి.

మద్యపానం చేసి వేడుకల్లో పాల్గొనవద్దు.

చిన్నారులు, మహిళలు, వృద్ధుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి

ప్రార్థనా మందిరాల వద్ద మతసామరస్యానికి దెబ్బతీయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

సామాజిక మాధ్యమాలలో తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు..

వినాయక విగ్రహాల నిమజ్జనం
ఊరేగింపు సందర్భంగా నగరంలో
నిర్ణయించిన రూట్ మ్యాప్

రూట్ నెం.1:

తాడిపత్రి బస్ స్టాండ్ , బసవన్నకట్ట – సూర్యనగర్ సర్కిల్ – సప్తగిరి సర్కిల్ వీటితో పాటుగా %జీమీఖ%, కలెక్టరేట్ వైపు వచ్చే విగ్రహాలు కూడా సంఘమేష్ సర్కిల్ మీదుగా సూర్య నగర్ సర్కిల్ వద్ద జాయిన్ అయ్యి, సప్తగిరి సర్కిల్ చేరుకుంటారు. అలాగే హౌసింగ్ బోర్డు, విద్యుత్ నగర్ సర్కిల్, నాయక్ నగర్, ఆదర్శ నగర్ వైపు విగ్రహాలు, అశోక్ నగర్, సాయి నగర్ ల ద్వారా నేరుగా సప్తగిరి సర్కిల్ వద్ద జాయిన్ అవుతారు.

రూట్ నెం.2:

ఒకటవ రోడ్డు నుండి ఆరవ రోడ్డు వరకు మరియు



రామచంద్ర నగర్ వైపు నుండి వచ్చే విగ్రహాలు సైఫుల్లా పై ఓవర్ బ్రిడ్జ్ మీదుగా శ్రీకంఠం సర్కిల్ వద్ద జాయిన్ అయ్యి, NTR సర్కిల్, టవర్ క్లాక్, PTC పై ఓవర్ బ్రిడ్జ్ మీదుగా నడిమివంక చేరుకుంటారు.

రూట్ నెం.3:

రుద్రంపేట, రామ్ నగర్, లక్ష్మినగర్, శ్రీంగర్ కాలనీ ల వైపు నుండి వచ్చే విగ్రహాలు రామ్ నగర్ పై ఓవర్ మీదుగా ప్రభుత్వ ఆసుపత్రి సర్కిల్, తెలుగుతల్లి సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ మీదుగా సప్తగిరి సర్కిల్ వద్ద జాయిన్ అవుతారు.

నిమజ్జన ప్రదేశాలు:

1) ఆత్మకూరు మండలం, పంపనూరు కెనాల్ వద్ద (4 అడుగుల కంటే ఎక్కువ ఎత్తు కలిగిన విగ్రహాలు)
2) అనంతపురం రూరల్ మండలం, రాచానపల్లి చెక్ డ్యామ్ వద్ద (4 అడుగుల లోపు ఎత్తు కలిగిన విగ్రహాలు)
3) అనంతపురం రూరల్ మండలం, రాచానపల్లి ఓల్డ్ పై ఓవర్ బ్రిడ్జ్ వద్ద (4 అడుగుల లోపు ఎత్తు కలిగిన విగ్రహాలు).

పవర్ ప్లాంట్ స్థల పరిశీలన చేసిన కలెక్టర్

భూమిపుత్ర , బుక్కరాయసముద్రం :





జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పి.ఎం. కుసుమ్ యోజన పథకం కింద పునరుత్పాదక ఇంధన ఆధారిత పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేసే క్రమంలో భాగంగా బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ ఇ శేషాద్రి, మండల తాసిల్దార్ శ్రీధర్ మూర్తి, ఎంపీడీవో సాల్మన్ మెగా ఇంజనీరింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ప్రతినిధులు, డి ఈ ఈ రఘు, ఏ ఈ ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా సర్వే నెంబర్ 103 కు సంబంధించిన 50 ఎకరాల వివరాలను రెవెన్యూ అధికారుల ద్వారా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పి.ఎం. కుసుమ్ యోజన పథకం ద్వారా వ్యవసాయ సౌర శక్తిని ప్రోత్సహించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. సోలార్ పంపులు మరియు గ్రిడ్ కనెక్ట్ చేయబడిన పునరుత్పాదక ఇంధన ఆధారిత పవర్ ప్లాంట్లను ప్రస్తుతం సేకరించిన సదరు భూమి వద్ద ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మెగా ఇంజనీరింగ్ లిమిటెడ్ కంపెనీ వారి ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో సోలార్ ప్లాంట్ 12 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి ప్రైవేట్ భూమిని రైతుల ద్వారా కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భూమి విక్రయించిన సంబంధిత రైతులతో కలెక్టర్ మాట్లాడారు. అనంతరం రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులతో ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై పలు ఆదేశాలు సూచనలు జారీ చేశారు.
అలాగే చెన్నంపల్లి గ్రామ సచివాలయం ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ పనితీరు గురించి ఆరా తీశారు. పలు రికార్డులను పరిశీలించారు.

ప్రేమ దక్కలేదని యువకుడి ఆత్మహత్య

భూమిపుత్ర , కూడేరు :



ప్రాణంగా ప్రేమించిన అమ్మాయి మోసం చేసిందని ఓ యువకుడు నిండు ప్రాణాలు తీసుకున్నాడు. చనిపోయే ముందు సెల్ఫీ వీడియో తీసుకొని తన గోడు వెల్లడించాడు. ఈ దారుణ ఘటన అనంతపురం జిల్లా కుడేరు మండలం గొట్టుకూరులో చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే.. కుడేరు మండలం గొట్టుకూరు సమీపంలో చెట్టుకు ఉరి వేసుకుని అనిల్ కుమార్ (27) యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రేమించిన యువతి వదిలేసిందని, ఫ్రెండ్స్ కూడా ఎవరు లేరని వీడియోలో తెలిపాడు. అమ్మా, నాన్నలు బాగుండాలని తన వద్ద ఉన్న మొబైల్ ఫోన్లో సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. అనంతరం అక్కడే ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని అనిల్ ఆత్మహత్య చేసుకున్నాడు.
సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అనిల్ కుమార్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమత్తం తరలించారు. మృతుడిని కనగానపల్లి మండలం గుంతపల్లి గ్రామానికి చెందిన అనిల్ కుమార్గా గుర్తించారు. మృతుడి వద్ద ఉన్న మొబైల్లోని వీడియో ఆధారంగా ప్రేమించిన యువతి వదిలేసిందని సెల్ఫీ వీడియో తీసుకొని యువకుడు సూసైడ్ చేసుకున్నట్లు పోలీసులు నిర్ధారించారు. దీనిపై కేసు నమోదు చేసుకుని పోలీసులు విచారణ చేపట్టారు.

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

డిఎంహెచ్ఓ డా.ఈ.బి.దేవి

భూమిపుత్ర ,అనంతపురం:



– జిల్లాలో ఉన్న స్కానింగ్ సెంటర్లలో ఎక్కడైనా గర్భస్థ పిండలింగ నిర్ధారణ చేసినట్లు ఆరోపణ వచ్చి రుజువైతే గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టరీత్య కఠిన చర్యలు తప్పవని జిల్లావైద్య ఆరోగ్య శాఖ అధికారిణీ డా.ఈ.బి. దేవి హెచ్చరించారు. శనివారం నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని తన చాంబర్ లో జిల్లా స్థాయి గర్భస్థ పిండలింగ నిర్ధారణ కమిటీ సమావేశం డిఎంహెచ్ఓ అధ్యక్షతన నిర్వహించారు.
– ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ జిల్లాలో జరుగుతున్న భ్రూణహత్యల గురించి ఆరాతీశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్ లు, డయాగ్నస్టిక్ సెంటర్ లు అనుమతి లేకుండా నడుపుతుంటే వాటిపై ప్రభుత్వ నిబంధన మేరకు చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా ఎట్టిపరిస్థితుల్లోనూ లింగ నిర్ధారణ పరీక్షలు జరపకూడదని, చట్టాన్ని అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఇంకా నిర్ధారణ కోసం ప్రయత్నించిన లేదా ప్రోత్సహించిన అట్టివారిపై కూడా చర్యలు తప్పవని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో ఉన్నటువంటి ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు గర్భవతులకు వైద్య సేవలు అందిస్తూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం ప్రకారం లింగ పరీక్షల నేరమని, ఆడపిల్ల అయినా మగపిల్ల అయినా సమానమే అని తెలియజేసే విధంగా వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల భాగస్వామ్యంతో విస్తృతంగా వివిధ మాధ్యమాల ద్వారా ప్రచార అవగాహన కార్యక్రమాలు జిల్లాలో విస్తృతంగా చేపట్టినట్లు తెలిపారు. అలాగే జిల్లాలో లింగ నిష్పత్తి కన్నా తక్కువగా ఉన్న అన్ని మండలాల్లో పటిష్టమైన ప్రణాళికలు రూపొందించి వాటన్నింటినీ ప్రతినెల సంబంధిత అధికారులకు ప్రగతి నివేదికలను తీసుకొని సమీక్షించడం జరుగుతున్నదని తెలిపారు. జిల్లాలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణను అరికట్టే క్రమంలో ఐసిడిఎస్, మెప్మా, పోలీసు, స్వచ్ఛంద సంస్థల సమన్వయ సహకారాలతో పటిష్ట చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు కూడా ఆడపిల్లల యొక్క ప్రాముఖ్యతను తెలుసుకోవాలని, ఆయా కుటుంబసభ్యులు లింగ నిర్ధారణ పరీక్షలు చేపట్టరాదని సూచించారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ వారి ఆదేశం మేరకు గర్భస్థ లింగ నిర్ధారణ చట్టంపై ప్రజలకు ఆకాశవాణి కేంద్రం ద్వారా సందేశాత్మకంగా అవగాహన కల్పించడం జరిగిందని, అలాగే అనంతపురం ప్రధాన కేంద్రంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి 08554- 288234 ఫోన్ నెంబర్ ద్వారా ప్రత్యేకంగా ఒక సెల్ ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా వీడియోను రూపొందించి చట్టంపై ప్రచారం కల్పిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలు, కాలేజీలలో విద్యార్థులకు కూడా లింగ నిర్ధారణ చట్టం ఆవశ్యకత గురించి అవగాహన కార్యక్రమాలు శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్నట్లు తెలిపారు.
ఈ సమావేశంలో ప్రోగ్రామ్ అధికారులు డా.యుగంధర్, డా అనుపమ, డా.నారాయణస్వామి, డా. శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ విష్ణుమూర్తి, సర్వజన ఆసుపత్రి చిన్నపిల్లల వైద్యులు డా.రవికుమార్, స్త్రీ వ్యాధి నిపుణులు డాక్టర్ పద్మశ్రీ, పాథ్యాలజీ నిపుణులు డా.దీప్తి, స్వచ్ఛంద సంస్థ ఆర్.డి.టి ప్రతినిధి డా.దుర్గేశ్, రెడ్స్ సంస్థ అనిత, ఐసిడిఎస్ వెంకటేశ్వరి, డెమో త్యాగరాజు, డిప్యూటీ హెచ్ఈఓ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

Printed, Published & Owned by Sake Siri Priya And Printed at Siri Publications,D.No:13/3-645,Khaja Nagar, Near Ganga Gowri Theatre, Anantapuramu -515001,Anantapuramu District, Andhrapradesh.
Published AT D.No: 13/3-645,Khaja Nagar, Near Ganga Gowri Theatre, Anantapuramu -515001,Anantapuramu District, Andhrapradesh EDITOR :Sake Siri Priya, e mail ID :bhumimedia85@gmail.com
cell No:9866216044 RNI Regn No :RNI/APTEL/2018/76435